తెలంగాణ శాసనసభ
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 206 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | మంగళవారం 31 డిసెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

# "చీకటి నెల" డిసెంబర్..!
## - విషాదం మిగిల్చిన విమాన ప్రమాదాలు..



**శాసనసభ / డెస్క్ :** ఇక చివరి నెల అయిన డిసెంబర్‌ను వరుస విమాన ప్రమాదాలు పలకరించాయి. ఏకంగా ఏడు ఘటనలు చోటు చేసుకోగా అందులో 240 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఏడాది ముగింపు వేళ చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో "చీకటి నెల"గా నిలిచింది. దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

### - డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు...

**19 మంది మృతి** డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది. ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు. డిసెంబర్ 24న అర్జెంటీనాలో బార్డియర్ ఛాలెంజర్ 300 విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. డిసెంబర్ 17న హవాయిలోని హోనోలులులోని ఇనౌయే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఓ విమానం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. విమానం లిఫ్ట్‌ఆఫ్ అయిన వెంటనే నియంత్రణ కోల్పోయి భవనాన్ని ఢీట్టింది.

## శ్రీవారి దర్శనం... చంద్రబాబు లేఖపై
## స్పందించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- చంద్రబాబు లేఖ రాసినట్లు వెల్లడించిన తెలంగాణ సీఎంవో
- చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు
- సిఫార్సు లేఖలను ఆమోదించాలని చంద్రబాబును రేవంత్ రెడ్డి కోరినట్లు వెల్లడి



**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబుకు, టీటీడీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ సీఎంవో ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల విజ్ఞాపన లేఖలను అనుమతించడానికి ఆదేశాలిచ్చిన చంద్రబాబు గారికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.

మిగతా »»4లో

## సినిమావాళ్లతో రేవంత్ రెడ్డి సెటిల్ చేసుకున్నారు.
## అల్లు అర్జున్ వ్యవహారంపై మరోసారి
## స్పందించిన కేటీఆర్

- కేవలం ప్రచారం కోసమే సీఎం సినిమా వాళ్ల గురించి మాట్లాడుతున్నారని విమర్శ
- హామీలు, సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని వ్యాఖ్య
- ఏసీబీ నమోదు చేసిన కేసులో బలం లేదని సీఎంకు తెలుసని వ్యాఖ్య
- ఎప్పుడు బయటకు రావాలో కేసీఆర్‌కు తెలుసన్న కేటీఆర్



## సాధారణ కాంగ్రెస్ కార్యకర్తకు దక్కిన
## గౌరవం కూడా పీవీకి దక్కలేదు

- పీవీ అంతిమ సంస్కారాలు ఢిల్లీలో జరపొద్దని సోనియా హుకుం జారీ చేశారన్న కేంద్రమంత్రి
- మన్మోహన్ కుటుంబాన్ని ప్రధాని మోదీ ఓదార్చారన్న కిషన్ రెడ్డి
- మన్మోహన్ సింగ్ మరణాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని విమర్శ

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ వాడైన పీవీ నర్సింహారావు పట్ల సోనియా గాంధీ అమర్యాదగా ప్రవర్తించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సాధారణ నాయకుడికి దక్కిన గౌరవం కూడా మన తెలంగాణ బిడ్డ పీవీకి ఆనాడు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ అంతిమ సంస్కారాలు ఢిల్లీలో జరపడానికి వీల్లేదని సోనియా నాడు హుకుం జారీ చేశారని



మండిపడ్డారు. పీవీ నర్సింహారావు భౌతిక కాయాన్ని హైదరాబాద్‌కు పంపించారన్నారు. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అన్నారు.

»»4లో

## రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్‌కు ఎక్కడో
## చెడినట్లుగా ఉంది...
## ఎవరూ చెప్పడం లేదు

- చట్టం తన పని తాను చేసుకుపోతే అసెంబ్లీలో చర్చ ఎందుకని ప్రశ్న
- ఆరు గ్యారెంటీల అమలును పక్కదారి పట్టించేందుకే అరెస్ట్ చేశారని విమర్శ
- పుష్ప-3 రాకముందే ఆ సినిమాను చూపించారన్న బండి సంజయ్



మిగతా »»4లో

## అదానీ గ్రూప్ కీలక నిర్ణయం..
## విల్మర్‌తోజాయింట్ వెంచర్‌కు గుడ్ బై..



**శాసనసభ / హైదరాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ ఓట్లు మీకే వేసుకోండని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న ఆయన..వంద రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. తాను సీఎం అవుతానన్నారు. తన సత్తా ఏంటో ఇప్పుడున్న వాళ్లకు తెలుసని కేఏ పాల్ తెలిపారు. ఇప్పుడున్న వాళ్ళు వందల కోట్లు ఖర్చుపెట్టి లక్షల కోట్లు దోచుకున్నారు.. బంగారు తెలంగాణ అన్న కేసీఆర్ తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. ఆయన మాటలతో వందల మందిని బలి చేశారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు వేరే పార్టీ తరఫున పోటీ చేయకండి..పార్టీలకు అతీతంగా ఏకగ్రీవం చేసుకోండని సూచించారు. చాలా మంది కులాన్ని వాడుకొని పార్టీలు లాభం పొందారు.. బీసీలను రెండు మూడు కులాల వారు అనగదొక్కారని కేఏ పాల్ తెలిపారు.

మిగతా »»4లో

## చంద్రబాబుకు థ్యాంక్స్ చెప్పిన తెలంగాణ మంత్రి కొండా సురేఖ



మిగతా »»4లో

## పూజారులకు నెలకు రూ.18 వేల జీతం.. ఎన్నికల హామీ ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్



మిగతా »»4లో

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ ఓట్లు మీకే వేసుకోండి.. ఇంట్రెస్టింగ్ కామెంట్స్



మిగతా »»4లో


శాసనసభ
తెలుగు దినపత్రిక
మంగళవారం 31 డిసెంబర్ - 2024

# విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించండి.. మంత్రులు విజ్ఞప్తి



**శాసనసభ / హైదరాబాద్ :** గత 25 రోజులుగా సర్వ శిక్షా ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెకు దిగారు. ఈ క్రమంలో..ఉద్యోగుల ప్రతినిధులతో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం, విద్యాశాఖ అధికారులు చర్చలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్ శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే సమ్మె విరమించాలని మంత్రులు కోరారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, కేజీబీవీ పాఠశాలల్లో బడగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారని, విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయవద్దని సర్వ శిక్షా ఉద్యోగులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో సర్వ శిక్షా ఉద్యోగులు తమ సమస్యలను చెప్పుకున్నారు. తాము సుదీర్ఘ కాలంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేస్తున్నామని.. తమని రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కూల్ అమలు చేయాలని తెలిపారు. అయితే.. సర్వ శిక్షా కస్తూర్బా గాంధీ పాఠశాలు కేంద్రం పరిధిలో 60 శాతం, రాష్ట్రం పరిధిలో 40 శాతం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. సర్వ శిక్షా ఉద్యోగుల సమస్య తెలంగాణలోనే లేదని.. దేశ వ్యాప్తంగా ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కోరితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి కేంద్రానికి ప్రతిపాదనలు పెడతామని మంత్రి పొన్నం వెల్లడించారు. 25 రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేయడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని.. తక్షణమే సమ్మె విరమించి ఉద్యోగులు విధుల్లో చేరాలని మంత్రులు కోరారు. సమ్మె విరమిస్తే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీతో సమావేశానికి పిలుస్తామని మంత్రి సీతక్క తెలిపారు. నాన్ ఫైనాన్సియల్ డిమాండ్స్‌లో మహిళా ఉద్యోగులకు మెటర్నిరి లీవ్స్, సీఎల్‌లు తదితర వాటిపై సాధ్యమైనంత వరకు ప్రభుత్వం పరిష్కరమయ్యేలా ప్రభుత్వం చూస్తుందని.. ఆర్థికపరమైన డిమాండ్స్ పై సబ్ కమిటీలో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని మంత్రులు పేర్కొన్నారు.

# సెల్‌ఫోన్ వాడొద్దని మందలించిన తండ్రి.. కూతురు అదృశ్యం



**శాసనసభ / హైదరాబాద్ :** నేటి తరంలో మొబైల్ ఫోన్ల వాడకం ఎక్కువైపోయింది. పెద్దల నుంచి మొదలు పెడితే పిల్లల వరకు అతిగా వాడేస్తున్నారు. అన్నం లేకుండా అయినా ఉంటారేమో కానీ..ఈరోజుల్లో ఫోన్ లేకుండా ఉండటం కష్టమైపోయింది. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వల్ల మొబైల్ ఫోన్ వాడకం మరింత పెరిగింది. దీంతో.. ఎక్కువగా పిల్లలు ఫోన్లకు బాగా అలవాటు పడిపోయారు. అయితే.. పిల్లల మొబైల్ ఫోన్ల వాడకంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా ఫోన్ వాడొద్దని వారికి సూచిస్తున్నా.. పిల్లలు మాట వినడం లేదు. కొందరైతే క్షణికావేశంలో ప్రాణాలను కూడా తీసుకుంటున్నారు. మరికొందరు తల్లిదండ్రులు మందలించడంతో అదృశ్యమైన సంఘటనలు ఎదురవుతున్నాయి. తాజాగా.. ఇలాంటి ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. సెల్ ఫోన్ వాడొద్దని తండ్రి మందలించడంతో కూతురు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పద్మశాలి టౌన్ షిప్‌లో వరుసు రాజు.. భార్య తన ఇద్దరు కుమారులు ఒక కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. కుమార్తె ఆరతి (19) ఈసీఐఎల్‌లోని ఒక కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతుంది. అయితే.. తన కూతురు ఫోను కంటిన్యూగా ఉపయోగిస్తుండడంతో ఫోన్ వాడొద్దని మందలించి సరిగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలని మార్గానిర్దేశం చేశాడు. దీంతో ఆరతి ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా.. బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు తండ్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కేటీఆర్, హరీశ్ రావులకు సినిమా చూపిస్తామన్న బీర్ల ఐలయ్య



**శాసనసభ / హైదరాబాద్ :** కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావుకు సినిమా చూపిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2025లో కేటీఆర్ అరెస్ట్ కావడం ఖాయమని జోస్యం చెప్పారు. అదే సమయంలో హరీశ్ రావు కొత్త దారి చూసుకుంటారన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్ మీద బయట ఉన్న కవితకు బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కథ క్లైమాక్స్‌కు వచ్చిందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఆయన, ఐఎన్‌టీయూసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థగా ఉన్న ఐఎన్‌టీయూసీ కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేసిందన్నారు.

# రేవంత్ ప్రభుత్వంలో అభివృద్ధిలో దూసుకెళ్తున్నాం..



**శాసనసభ / హైదరాబాద్ :** కాంగ్రెస్ ఏడాది కాలంలో రేవంత్ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు వెళుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. అనేక ప్రభుత్వాల్లో.. శాఖల్లో పని చేసిన సమయంలో జిల్లా అభివృద్ధి ధ్యేయంగా పని చేశానని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడ ఏ సమస్య ఉన్న పరిష్కరించానని పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించిన అధికారుల మార్పిడి, వరదల వల్ల కొంత కాలం ఇబ్బందులు ఏర్పడినప్పటికీ ఇప్పుడు పనులు స్పీడ్ అందుకున్నాయని వెల్లడించారు. 500 ఎకరాల్లో వెలుగుమట్ల ఎకో పార్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. జూ పార్క్ ను ఏర్పాటు చేస్తాం.. ఖమ్మంకు చారిత్రాత్మకమైన ఖిల్లా పై రోపు వే ఏర్పాటు చేస్తాం.. హైదరాబాద్ శిల్పారామం మాదిరిగా వెలుగుమట్ల, ఖమ్మం ఖిల్లాను తయారు చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. కొత్త ఏడాదిలో పనులు ఏర్పాటు చేస్తాం.. రూ.700 కోట్లతో మున్నేరు ఖమ్మంలోకి రాకుండా చేస్తామని తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రూ.220 కోట్లతో చెరువుల నుంచి ఖమ్మంలోకి వరద రాకుండా చేయనున్నామని.. ఖమ్మం నగరంలో రూ.220 కోట్లతో మంచినీటి సమస్య లేకుండా పథకం తీసుకొస్తామని తెలిపారు. అలాగే.. మెడికల్ కాలేజి నిర్మాణం చేయనున్నామని చెప్పారు. స్వామి నారాయణ్ ద్వారా స్కూల్ నిర్మాణం చేస్తున్నాం.. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేస్తున్నాం.. ఖమ్మం పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేయనున్నామని అన్నారు. ఖమ్మం మున్నేరు పై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం.. జాతీయ రహదారుల నిర్మాణం చేస్తున్నాం.. ఖమ్మంకు ఒక్క రింగ్ రోడ్డు మాదిరిగా జాతీయ రహదారుల మీదుగా చేస్తున్నామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. గోదావరి జలాలు పది నియోజకవర్గాలకు రావడం తన కోరిక.. దానిని పూర్తి చేయడమే లక్ష్యమని తుమ్మల చెప్పారు. సీతారామ ప్రాజెక్టు మళ్ళీ వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి యాతల కుంట టన్నెల్ పూర్తి చేసి నీళ్లు ఇస్తాం.. జగ్గయ్య పేట నుంచి వైరా మీదుగా నేషనల్ హైవే నిర్మాణం చేస్తామని అన్నారు. కొత్తగూడెం నుంచి కౌతల రోడ్ నిర్మాణం చేస్తే భద్రాచలం కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. రూ.3000 కోట్లతో సీతమ్మ సాగర్ పూర్తి అయితే.. పోలవరం నుంచి కాళేశ్వరం వరకు గోదావరిలో వాటర్ వేస్ ను చేయాలన్న కోరిక ఉందని అన్నారు. పాండురంగపురం నుంచి భద్రాచలం వరకు రైల్వే లైన్ నిర్మాణం పై కేంద్రాన్ని అడుగుతున్నాం.. ఎయిర్ వేస్ కొత్తగూడెంకు అవకాశం వుందని తెలిపారు. కొత్తగూడెం మైనింగ్ కాలేజీ యూనివర్సిటీగా చేయాలని కోరుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

# రేవంత్ ఎందులో గొప్పో పవన్‌కే తెలియాలి

## పుష్ప-2 కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా



**శాసనసభ / హైదరాబాద్ :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు గొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. పుష్ప -2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా ముట్టిందేమోననే అనుమానం తనకు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ ఎందుకు పెట్టారంటే.. అల్లు అర్జున్ కోసం అన్నట్లుగా ఉందని విమర్శించారు. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చేడిందని ఆరోపించారు. ఒక వ్యక్తి గురించి ఇంతగా అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరం ఏంటని బండి సంజయ్ నిలదీశారు. కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం జరుగుతోందని బండి సంజయ్ విమర్శించారు. మిషన్ల విషయంలో మంత్రుల మధ్య సఖ్యత లేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు.. వాళ్లలో వాళ్లు ఏమైనా చేసుకోవచ్చని షాకింగ్ కామెంట్స్ చేశారు. 14 శాతం కమిషన్ మీదే ప్రభుత్వం బతుకుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ముగ్గురు మంత్రుల బండారం బయట పెడతానని హెచ్చరించారు. బ్రోకర్లను పెట్టుకుని బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంత్రులందరికీ సీఎం కావాలని ఉందని అన్నారు. ఢిల్లీకి డబ్బులు పంపడం వల్లే.. సీఎం పదవి నిలబడుతోందని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే మంత్రుల కుర్చీలు కూడా ఉండవని బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# మద్యం షాపులో దొంగతనానికి వచ్చిన దొంగ.. కిక్కులో ఏం చేశాడంటే..?



**శాసనసభ / హైదరాబాద్ :** డబ్బుల కోసం ఓ మద్యం షాపులోకి దొంగతనానికి వెళ్లిన దొంగకు.. అక్కడ మద్యం బాటిళ్లను చూసే సరికి తాను వచ్చిన పనిని మొత్తం మరిచిపోయాడు. డబ్బులు కొట్టేయడానికి వచ్చిన ఆ దొంగకు మందు సీసాలే ఎక్కువనుకున్నాడు. ఇంకేముంది.. పీకలకాడికి తాగేశాడు. ఆ తర్వాత సోయి తప్పి పడుకున్నాడు. ఉదయం రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగ్ మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మద్యం షాపులో దొంగతనానికి వచ్చి ఫుల్లుగా మద్యం తాగి వైన్స్ షాప్ లోనే నిద్ర పోయాడు ఓ దొంగ. నార్సింగ్ మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్ షాపులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎప్పటిలాగే.. ఆదివారం రాత్రి వైన్ షాపు మూసేసి యజమాని ఇంటికి వెళ్లిపోయాడు. అయితే.. రాత్రి దొంగతనానికి వచ్చిన దొంగ.. కనకదుర్గ వైన్స్‌లో పై కప్పు రేకులు తొలగించి అందులో దూరి దొంగతనానికి ప్రయత్నించాడు. దొంగతనం తర్వాత వెళ్ళేటప్పుడు మద్యం తాగడంతో మత్తులోనే నిద్రపోయాడు. సోమవారం ఉదయం వైన్స్ తెరవగా అందులో ఇతర రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి నిద్రపోయి ఉన్నాడు. షాప్ యజమాని మాట్లాడుతూ.. దొంగతనానికి వచ్చి కౌంటర్‌లో నగదు, మద్యం బాటిళ్లు ఓ సంచిలో దొంగ మూట కట్టుకున్నాడని తెలిపాడు. అంతేకాకుండా.. సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్ లు ధ్వంసం చేశాడని అన్నాడు. ఈ ఘటనపై పోలీసులకి సమాచారం ఇవ్వడంతో దొంగని అదుపులోకి తీసుకుని.. అనంతరం ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు చెప్పాడు. కాగా.. మద్యం తాగిన మత్తులో దొంగతనానికి వచ్చిన సంగతి మర్చిపోయి దుకాణంలోనే పడుకొని సంఘటన మండల కేంద్రంలో హాట్ టాపిక్ గా మారింది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు.. బ్యాంకింగ్, ఆటో షేర్లు పడేశాయ్



**శాసనసభ / హైదరాబాద్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాన్ని నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాల నేపథ్యంలో బ్యాంకింగ్, ఆటో షేర్లు అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 78,637.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,699.07) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. 11 గంటల సమయంలో లాభాల్లోకి వెళ్లి సూచీ.. 79,092 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఓ దశలో 78,077.13 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 450.94 పాయింట్ల నష్టంతో 78,248.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 168.50 పాయింట్ల నష్టంతో 23,664.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 4 పైసలు క్షీణించి 85.52గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు నష్టపోయాయి. జొమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ 73.98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2625 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# నగర వాసులకు గుడ్ న్యూస్.. అర్ధరాత్రి వరకు మెట్రో సేవలు



**శాసనసభ / హైదరాబాద్ :** ఆంగ్ల నూతన సంవత్సరాది మరికొన్ని గంటల్లో రానుంది. ఈ క్రమంలో ప్రపంచమంతా వేడుకలకు సిద్ధం అవుతుంది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో రైళ్లు అర్ధరాత్రి వరకు సేవలందించనున్నాయి. డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ సందర్భంగా రాత్రి 12.30 వరకు నడవనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రేపు అర్ధరాత్రి 12.30కి చివరి రైలు స్టేషన్ నుండి బయలుదేరి 1.15 వరకు డెస్టినేషన్ స్టేషన్లో చేరుకోనున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా అర్ధరాత్రి వేడుకలు ఉండటంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు విస్తృతంగా జరిగే అవకాశం ఉండటంతో సేఫ్ గా ఇంటికి చేరుకునేందుకు మెట్రో ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ క్రమంలో.. ప్రయాణికులు మెట్రో రైల్‌లో సేవ్ జర్నీ చేయాలని మెట్రో ఎండీ సూచించారు. మెట్రో రైల్ సేవలను ప్రత్యేక అకేషన్ పండుగలు టైంలో అర్ధరాత్రి వరకు మెట్రో సేవలను పొడిగిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి మెట్రోలో తోటి ప్రయాణికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులంతా బాధ్యతాయుతంగా వ్యవహారించాలని మెట్రో ఎండీ సూచించారు.

# అన్ని కార్యక్రమాల్లో ప్రభుత్వ భాగస్వామిగా ఉంటాం..



**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగిస్తామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో ఆయనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం భేటీ అయింది. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడి హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని.. ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్య నాదెళ్లకు తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లలోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని.. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు సత్య నాదెళ్లకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐ, %+వఅ ఞా×%, క్లౌడ్‌తో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని సీఎం రేవంత్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్లకు విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# ట్రై యాంగిల్ సూసైడ్ కేసులో ఎలాంటి ఐ విట్‌నెస్‌లు లేవు..



**శాసనసభ / హైదరాబాద్:** కామారెడ్డి జిల్లాలో కలకలం సృష్టించిన భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్, బీబీ పేట కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మృతి ఘటన ఎట్టకేలకు మిస్టరీ వీడింది. ఈ ట్రై యాంగిల్ సూసైడ్ కేసు గురించి ఎస్పీ సింధు శర్మ మీడియాకు వివరాలు తెలిపారు. ముగ్గురు ఆత్మహత్య కేసులో ఎలాంటి ఐ విట్‌నెస్‌లు లేవని అన్నారు. ముందుగా ఒకరు చెరువులో దూకితే కాపాడేందుకు మిగతా ఇద్దరు దిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. నిఖిల్‌కు ప్రాణహాని ఉన్నట్లు గతంలో ఫిర్యాదు చేసిన విషయం తనకు తెలియదని ఎస్పీ తెలిపారు. ఆ విషయంలో ఎంక్వైరీ చేస్తున్నాం.. పోస్టుమార్టం ప్రైమరీ రిపోర్ట్ వచ్చిందని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఆత్మహత్యలకు గల కారణాలను విచారణ చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. అక్కడ జరిగిన సంఘటనకు సంబంధించి ఎలాంటి ప్రత్యక్ష సాక్ష్యులు లేరు.. అవి ఆత్మహత్యలా, ప్రమాదకరంగా జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నామన్నారు. మొబైల్ ఫోన్ సంభాషణల ఆధారంగా ఆ ముగ్గురు చెరువు దగ్గరకు వెళ్లినట్టు తెలుస్తుంది.. ఆత్మహత్యలకు సంబంధించి మొబైల్ ఫోన్లు, నీటి నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపడం జరిగిందని ఎస్పీ సింధు శర్మ చెప్పారు.

## నెఫ్ట్, ఆర్టీజీఎస్ లావాదేవీలకు త్వరలో కొత్త సదుపాయం




శాసనసభ / హైదరాబాద్ : RTGS,NEFT చెల్లింపుల విషయంలో పొరబాట్లకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కొత్త సదుపాయం రానుంది. ఇకపై ఆయా చెల్లింపుల వ్యవస్థల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు అవతలి వ్యక్తి పేరు కనిపించనుంది.ఈ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1కల్లా దీన్ని అందుబాటులోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ సర్క్యులర్ జారీ చేసింది. బ్యాంకులన్నీ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌పీసీఐకి గడువును నిర్దేశించింది.ప్రస్తుతం యూపీఐ, ఐఎంపీఎస్ లో నేమ్ లుక్- అప్ సదుపాయం ఉంది. కొత్తగా రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్, నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌లోనూ విస్తరించనున్నారు. పొరబాటు చెల్లింపులను తగ్గించేందుకు ఈ సదుపాయం ఉయోగపడనుంది. దీనివల్ల పేమెంట్ చేసేటప్పుడు అకౌంట్ నంబర్, బ్రాంచ్ ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎంటర్ చేసేటప్పుడు అవతలి వ్యక్తి పేరు కూడా కనిపిస్తుంది.దీంతో చెల్లింపుల్లో పొరబాట్లకు ఆస్కారం తగ్గుతుంది. యూపీఐ సదుపాయం పాపులర్ కాకముందు ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ పేమెంట్ సదుపాయాలు విస్తృతంగా వాడుకలో ఉండేవి. పెద్దమొత్తంలో సొమ్ములు పంపించేందుకు వీటిని ఇప్పటికీ వినియోగిస్తుంటారు. ఈ పేమెంట్ల కోసం బ్యాంక్ ఖాతా నంబర్, బ్యాంక్ పేరు, బ్రాంచి ఐఎఫ్ఎస్‌సీ కోడ్, అమౌంట్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది.

## మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో కీలక పరిణామం



మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్ల దహనం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు, అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన గౌతమ్‌తేజ్‌ను ఏపీ సీఐడీ అరెస్టు చేసింది.పలమనేరులో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు చిత్తూరు కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది.జులై 21న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉన్నట్లు కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ప్రమాదం జరగడానికి ముందు అక్కడ పని చేసిన ఆర్డీవో, ఇతర అధికారులను పోలీసులు వారం రోజుల పాటు విచారించారు. ప్రాథమిక ఆధారాలు లభ్యం కావడంతో ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు.

## ఓఆర్‌ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతి



న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో ఫ్లైఓవర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు.ఓఆర్‌ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు. మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యాజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని పోలీసులు సూచించారు.న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణ వేళల్లో ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు మార్పులు చేసింది. డిసెంబరు 31న అర్ధరాత్రి 12.30 గంటల వరకు (జనవరి 1 ప్రారంభ వేళల్లో) మెట్రో రైలు సర్వీసులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. న్యూఇయర్ వేడుకల తర్వాత ప్రతి ఒక్కరూ రవాణా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా ఇళ్లకు చేరుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎల్‌అండ్‌టీ మెట్రో 'ఎక్స్' వేదికగా పేర్కొంది. ప్రతి కారిడార్‌లో చివరి మెట్రో స్టేషన్ నుంచి ఆఖరి సర్వీసు 12.30 గంటలకు బయలుదేరుతుందని పేర్కొంది.

## ఐపీఎస్‌ల బదిలీ.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు ఏఎస్పీగా కాజల్, ఆసిఫాబాద్ ఏఎస్పీగా ఎస్.చిత్తరంజన్ నియమితులయ్యారు.బదిలీ అయిన మిగతా అధికారులు వీరే..కామారెడ్డి ఏఎస్పీగా బి.చైతన్యరెడ్డి జనగామ ఏఎస్పీగా పి.చేతన్ నితిన్ భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్ కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా ఎన్.శుభం ప్రకాష్ నిర్మల్ ఏఎస్పీగా రాజేష్ మీనా దేవరకొండ ఏఎస్పీగా పి.మౌనిక భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి

## 68వేల రిజర్వేషన్ బుకింగ్స్ రద్దు!

దక్షిణ కొరియాలోని ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం జరిగిన దుర్ఘటనతో అక్కడి ప్రజలు విమాన ప్రయాణాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొంది! నిన్నటి నుంచి అక్కడ రద్దవుతున్న బుకింగ్సే ఇందుకు నిదర్శనం. ఇప్పటివరకు దాదాపు 68వేల విమాన రిజర్వేషన్ బుకింగ్స్ రద్దయినట్లు జెజు ఎయిర్ వెల్లడించింది. వీటిలో 33వేలకు పైగా దేశీయ విమాన సర్వీసులకు సంబంధించిన బుకింగ్స్ కాగా.. 34వేలకు పైగా అంతర్జాతీయం బుకింగ్స్ ఉన్నాయని పేర్కొంది. టూర్ ప్యాకేజీల క్యాన్సిలేషన్స్ పెరుగుతున్నట్లు స్థానిక ట్రావెల్ ఏజెన్సీలు చెబుతున్నట్లు అక్కడి పత్రికలు పేర్కొంటున్నాయి. ఆదివారం ఒక్కరోజే తమకు 40కి పైగా క్యాన్సిలేషన్‌కు సంబంధించిన ఎంక్వైరీలు వచ్చినట్లు ఓ ట్రావెలర్ తెలిపారు. బుకింగ్స్ దాదాపు 50శాతం మేర తగ్గినట్లు చెబుతున్నారు.ఈ విమాన దుర్ఘటనపై దక్షిణ కొరియా రవాణా మంత్రిత్వశాఖ అధికారి ఒకరు స్పందించారు. జెజు ఎయిర్ విమానం 7%జ% 2216 పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)కి సమాచారం ఇచ్చారన్నారు. ఈ విమానం కూలడానికి కొద్దిసేపటికి ముందే మేడే కాల్ ప్రకటించి.. పక్షి ఢీకొట్టినట్లు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటనపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ అత్యవసర సమావేశం నిర్వహించారు. జనవరి 4వరకు జాతీయ సంతాప దినాలు ప్రకటించడంతో పాటు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ



విమాన దుర్ఘటనలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అంత్యక్రియలు చేసేందుకు తమ వారి భౌతిక కాయాలు అప్పగించాలని కోరుతున్నారు.జెజు ఎయిర్ విమానం థాయ్‌లాండ్ నుంచి 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో దక్షిణ కొరియా లోని సియోల్‌కు 290 కిలోమీటర్ల దూరంలోని ముయాన్‌కు బయలుదేరింది. మరో అయిదు నిమిషాల్లో క్షేమంగా ల్యాండ్ అవుతామని అనుకున్న సమయంలోనే.. విమానం రన్‌వేపై జారుతూ.. నిప్పురవ్వలు రాజేస్తూ రక్షణ గోడ వైపు దూసుకెళ్లి, గోడను ఢీకొట్టి, పేలిపోయింది. ఇద్దరు మినహా ఏ ఒక్కరూ ప్రాణాలతో బయటపడలేకపోయారు. పేలిపోయిన బోయింగ్ 737-800 జెట్ విమానం 15ఏళ్ల కిందటిది. ప్రస్తుతం దక్షిణకొరియాలో ఈ రకానికి చెందిన విమానాలు 101 ఉండగా.. వీటికి సంబంధించి ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు కొరియా ప్రభుత్వం సోమవారం వెల్లడించింది.

## 'కార్పెంటర్'గా కార్టర్.. మాజీ అధ్యక్షుడి పేరుతో కార్టర్‌పురి!

అమెరికా 39వ అధ్యక్షుడిగా సేవలందించిన జిమ్మీ కార్టర్ . అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. వితరణశీలి, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత జిమ్మీకి భారత్‌తోనూ మంచి అనుబంధం ఉంది.గతంలో భారత్‌లో పర్యటించిన ఆయన.. ముంబయి సమీపంలో ఓ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో సేవలందించారు.ఆ సందర్భంలో స్వయంగా కార్పెంటర్ గా అవతారమెత్తారు. అంతకు ముందు అధ్యక్షుడి హోదాలో భారత్‌లో పర్యటించగా.. ఇందుకు గుర్తుగా హరియాణాలో ఓ గ్రామానికి కార్టర్‌పురి అని పేరు పెట్టడం విశేషం.మహారాష్ట్రలోని లోనావాలా సమీపంలో ఓ స్వచ్ఛంద సంస్థ పేద కుటుంబాలకు 100 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో పాల్గొనేందుకు అక్టోబర్ 2006లో భారత్‌కు వచ్చిన కార్టర్.. సతీమణి రోసలిన్‌తో కలిసి ఓ వారం పాటు ఇక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా జిమ్మీ కార్టర్.. కార్పెంటర్‌గా సేవలందించారు. దాదాపు 2వేల మంది అంతర్జాతీయ, స్థానిక వాలంటీర్లతో కలిసి పనిచేశారు. హాలీవుడ్ నటుడు బ్రాడ్ పిట్, బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం వంటి ప్రముఖులు ఈ వాలంటీర్ల జాబితాలో ఉన్నారు.అమెరికా అధ్యక్షుడిగా (1977 నుంచి 1981 వరకు) పనిచేసిన జిమ్మీ కార్టర్‌కు గృహ నిర్మాణంలో నైపుణ్యాలు తెలుసు. వైట్‌హౌస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఈ క్రమంలో 1984 నుంచి ఏడాదిలో ఒక వారం



పాటు స్వచ్ఛంద సంస్థ కోసం స్వయంగా పనిచేసేందుకు నిర్ణయించుకున్నారు. ఆయన తల్లి లిలియన్ కూడా ముంబయి సమీపంలో ఉన్న ఓ కుష్ఠురోగుల కాలనీలో (1960ల్లో) సేవలందించినట్లు జిమ్మీ పలు సందర్భాల్లో గుర్తుచేశారు.భారత్‌కు సన్నిహితుడిగా పేరొందిన జిమ్మీ కార్టర్‌కు మనదేశంతో విడదీయరాని బంధం ఉన్నట్లు చెబుతుంటారు. భారత్‌లో పర్యటించిన అమెరికా మూడో అధ్యక్షుడు జిమ్మీ కాగా. ఎమర్జెన్సీ ఎత్తివేసిన అనంతరం (జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత) మనదేశంలో పర్యటించిన తొలి యూఎస్ అధ్యక్షుడు ఆయనే. జనవరి 1978 మొదటి వారంలో భారత్‌లో పర్యటించిన నేపథ్యంలో పార్లమెంటులోనూ ప్రసంగించారు. దేశ రాజధానికి సమీపంలోని పలు ప్రాంతాల్లోనూ కలియతిరిగారు. సతీమణితో కలిసి హరియాణాలోని దౌలత్‌పుర్ నసీరాబాద్ గ్రామంలో పర్యటించారు. అనంతరం ఆయనకు గుర్తుగా ఆ గ్రామం పేరును 'కార్టర్‌పురి'గా మార్చడం గమనార్హం.

## ఆంధ్రప్రదేశ్‌లో 2,63,411 మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు

శాసనసభ /హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లో 2,63,411 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా రాష్ట్రానికి రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ మేరకు సచివాలయంలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే పలు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై ఎస్ఐపీబీ సమావేశంలో చర్చించారు.దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టుల్లో 9 కీలక ప్రాజెక్టుల స్థాపనకు సీఎం ఆమోదముద్ర వేశారు. ఈ 9 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. దాదాపు 2,63,411కుపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో ప్రధానంగా నెల్లూరు జిల్లా రామాయపట్నంలో బీపీసీఎల్ 6 వేల ఎకరాల విస్తీర్ణంలో రూ.96,862 కోట్ల పెట్టుబడితో భారీ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా దాదాపు 2,400 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 5 బ్లాకుల్లో ఈ రిఫైనరీ ఏర్పాటు కానుంది. వచ్చే 20 ఏళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ.88వేల కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.విశాఖ మిలీనియం టవర్స్‌లో రూ.80 కోట్ల పెట్టుబడితో కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు





టీసీఎస్ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి కూడా ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారు. దీని ద్వారా దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అనకాపల్లి జిల్లాలో 106 ఎకరాల్లో రూ.1174 కోట్ల పెట్టుబడితో మరో సంస్థతో పాటు ఇంధన రంగానికి చెందిన పలు సంస్థల ప్రాజెక్టులకు సైతం సీఎం ఆమోదం తెలిపారు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా పలు సంస్థలు దాదాపు రూ.83 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.4వేల కోట్ల మేర ఆదాయం సమకూరనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 2028నాటికి ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## ఆతిశీని తాత్కాలిక సీఎంగా చెప్పడం బాధించింది




దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని తాత్కాలిక సీఎంగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొనడంపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇది తనను బాధించిందన్నారు. ఒక ముఖ్యమంత్రిగా కేవలం ఆతిశీకే కాదని.. రాష్ట్రపతి ప్రతినిధిగా తనకూ అవమానకరమని అన్నారు. కేజ్రీవాల్ చేస్తున్న ప్రకటనలు దిల్లీ ప్రభుత్వ తీరుపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంటూ సీఎంకు లెఫ్టినెంట్ గవర్నర్ సుదీర్ఘ లేఖ రాశారు."కొన్ని రోజుల క్రితం మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ మిమ్మల్ని (ఆతిశీ) తాత్కాలిక ముఖ్యమంత్రిగా పేర్కొన్నారు. అది నాకు చాలా అభ్యంతరకరంగా అనిపించింది. ఇది మీతో (సీఎం) పాటు మాకు కూడా అవమానకరమే. కేజ్రీవాల్ చెప్పిన తాత్కాలిక ముఖ్యమంత్రి అనే పదం రాజ్యాంగంలో ఎక్కడా లేదు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించేదే" అని పేర్కొంటూ ముఖ్యమంత్రి అతిశీకి రాసిన లేఖలో లెఫ్టినెంట్ గవర్నర్ పేర్కొన్నారు.సీఎంకు వ్యక్తిగతంగా ఈ లేఖ రాస్తున్నట్లు చెప్పిన ఎల్జీ.. ముఖ్యమంత్రి అతిశీపై ప్రశంసలు కురిపించారు. మునుపటి ముఖ్యమంత్రి మాదిరిగా కాకుండా అనేక శాఖలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. పాలనాపరంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం అతిశీని నెగటీవ్‌గా చిత్రీకరిస్తూ ప్రచారం చేయడం తనను ఎంతో నిరాశకు గురిచేసిందన్నారు.

## క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అదరగొట్టారు.. 8వేల మంది సీఏలకు జాబ్ ఆఫర్లు.. ప్యాకేజీ ఎంతంటే?



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సీఏ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అదరగొట్టారు.ఈ ఏడాది పలు నగరాల్లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 8వేల మందికి పైగా విద్యార్థులు కొలువులు సాధించారు. గతేడాది నవంబర్, ఈ ఏడాది మే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆకర్షణీయ వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ ధీరజ్ ఖండేల్వాల్ తెలిపారు.సీఏ ఫైనల్ ఫలితాల్లో మనోళ్లే టాపర్లు..ఈ ఏడాది ఫిబ్రవరి -మార్చిలో నిర్వహించిన 59వ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 140 కంపెనీలు పాల్గొనగా 3,002 మంది విద్యార్థులు ఎంపిక కాగా.. మే -జూన్ మధ్య జరిగిన 60వ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో అత్యధికంగా 241 కంపెనీలు పాల్గొన్నాయని ఖండేల్వాల్ వెల్లడించారు. ఐసీఏఐ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో 4782మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. జాబ్ మార్కెట్లో సీఏలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ గణాంకాలే నిదర్శనమన్నారు.59వ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో డియాజియో ఇండియా అనే కంపెనీ అత్యధికంగా రూ.29లక్షలు వార్షిక వేతన ప్యాకేజీకి ఎంపిక చేయగా.. 60వ డ్రైవ్‌లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అనే కంపెనీ రూ.26.70లక్షల ప్యాకేజీ ఇచ్చి సీఏలను ఎంపిక చేసుకోవడం విశేషం. మొత్తంగా సగటు వార్షిక వేతన ప్యాకేజీ రూ.13.24లక్షల నుంచి 12.49లక్షలుగా ఉంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు తొమ్మిది ప్రధాన నగరాలతో పాటు 20 చిన్న చిన్న నగరాల్లోనూ ఈ డ్రైవ్‌లు నిర్వహించారు. సాధారణంగా 150 కంపెనీలే పాల్గొంటుండేవని అధికారులు తెలిపారు. మరోవైపు, వచ్చే ఏడాది జనవరి 24-25 తేదీల్లో ఓవర్సీస్ ప్లేస్‌మెంట్స్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు ఐసీఏఐ ఏర్పాట్లు చేస్తోంది. యూఏఈ, ఆసియా, యూరప్ సహా పలు దేశాలకు సీఏలను పంపడమే లక్ష్యంగా నిర్దేశించుకొని ఆ దిశగా అడుగులు వేస్తోంది.

## ఏడాది చివర్లో దుమ్ము దులిపిన ఇస్రో.. నాలుగో దేశంగా ఘనత



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఏడాది చివర్లో మరో ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇస్రో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్పేడెక్స్ మిషన్ విజయవంతంగా నింగిలోకి దూసుకువెళ్లింది.PSLV C-60 రాకెట్ రెండు కృత్రిమ ఉపగ్రహాలను చేజర్ (SX01), టార్గెట్ (SDX02)లను అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. ఈ రెండు ఉపగ్రహాల బరువు 440 కిలోలు. సోమవారం రాత్రి సరిగ్గా 10 గంటల 15 నిమిషాలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగం విజయవంతమైంది.ఇది స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలో అనుసంధానం చేసే బృహత్తర ప్రయోగం కావడం విశేషం. స్పేస్‌క్రాఫ్ట్‌ను డాకింగ్, అన్‌డాకింగ్ చేసేందుకు అవసరమైన టెక్నాలజీ అభివృద్ధి, ప్రదర్శన స్పేడెక్స్ మిషన్ ప్రధాన లక్ష్యమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమ నౌకలను అంతరిక్షంలోనే ఒకదానితో ఒకటి డాకింక్ చేయించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం.చంద్రుడిపై వ్యోమగామిని దించడం, చంద్రుడు నుంచి మట్టిని తీసుకురావడం, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించాలన్న భారత్ కల సాకారం కావాలంటే.. వ్యోమ నౌకల డాకింగ్, అన్ డాకింగ్ సాంకేతికత ఎంతో అవసరమని ఇస్రో పేర్కొంది.ఈ ప్రయోగం విజయవంతమైతే.ఈ సాంకేతికతను కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఇప్పటికే అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈ సాంకేతికతను కలిగి ఉన్నాయి.

## పూజారులకు నెలకు రూ.18 వేల జీతం.. ఎన్నికల హామీ ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్

త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ తిరిగి విజయం సాధిస్తే దేవాలయాల పూజారులు, గురుద్వారాల గ్రంథి లకు నెలకు రూ.18 వేల వేత్తనాన్ని చెల్లిస్తామని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఈమేరకు సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన మరో ఎన్నికల హామీని ఆయన వెల్లడించారు."పురోహితులు, గ్రంథిలు మన మతపరమైన ఆచారాలకు సంరక్షకులుగా కొనసాగు తున్నారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోలేదు. అందుకే మేము మళ్లీ అధికారంలోకి వస్తే నెలనెలా రూ.18,000 జీతం చెల్లిస్తాం. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి (మంగళవారం) నుంచి ప్రారంభమవుతుంది. హనుమాన్ ఆలయంలో నేనే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తాను" అని కేజ్రీవాల్ తెలిపారు.రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు సృష్టించవద్దని బీజేపీని తాను అభ్యర్థిస్తున్నానని, ఈ ప్రక్రియను అడ్డగిస్తే పాపం చేసినట్లే అవుతుందని కేజ్రీవాల్ హెచ్చరించారు. పూజారులు, గ్రంథిలు మన దేవుళ్లకు వారధిగా ఉంటున్నారని కొనియాడారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆప్ పార్టీ వరుసగా ఎన్నికల హామీలను ప్రకటిస్తోంది. ముందుగా సీనియర్ సిటిజన్ల కోసం 'సంజీవని' పథకం, ఆ తర్వాత 'మహిళా సమ్మాన్ యోజన', సంజీవని యోజన కింద 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత ఆరోగ్య సంరక్షణ ఉంటుంది. మహిళా సమ్మాన్ యోజన పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఆర్థిక సాయం అందజేస్తామని ఆప్ పార్టీ ప్రకటించింది.

## సాధారణ కాంగ్రెస్ కార్యకర్తకు దక్కిన గౌరవం కూడా పీవీకి దక్కలేదు

తాను కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన వీల్ చైర్‌లో రాజ్యసభకు వచ్చారని తెలిపారు. ఎన్నోసార్లు మన్మోహన్ సింగ్‌కు నమస్కరించే అవకాశం తనకు దక్కిందన్నారు. ఎన్నో ఒత్తిళ్ల మధ్య ఆయన పదేళ్లు ప్రధానిగా పని చేశారని ప్రశంసించారు. మన్మోహన్ సింగ్ మరణాన్ని కూడా కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాజపేయికి ఏర్పాటు చేసినట్లుగానే మన్మోహన్ సింగ్‌కు కూడా స్మారక కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో ప్రధాని మోదీ ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారన్నారు. కేంద్రాన్ని, మోదీని విమర్శించే నైతిక అర్హత రాహుల్ గాంధీకి లేదన్నారు.

## చంద్రబాబుకు థ్యాంక్స్ చెప్పిన తెలంగాణ మంత్రి కొండా సురేఖ

శ్రీవారి దర్శనంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని నిర్ణయించినందుకు ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు సాయంత్రం ఆమె సోషల్ మీడియా వేదికగా ఈ అంశంపై ప్రకటన విడుదల చేశారు.తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అంగీకరించడం కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కృషి చేశామని, ఇది ఫలించిందన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సును అంగీకరించడం కొత్త సంవత్సర కానుకగా అభివర్ణించారు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నిత్యం పరస్పర సహకారం అవసరమన్నారు. ఇది ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ఆమోదం తెలిపినందుకు గాను ఏపీ సీఎంతో పాటు ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అదానీ గ్రూప్ కీలక నిర్ణయం.. విల్మర్‌తోజాయింట్ వెంచర్‌కు గుడ్ బై..

అదానీ గ్రూపునకు చెందిన ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ విల్మార్ షేర్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. విల్మార్ లిమిటెడ్‌లో అదానీ గ్రూప్ తన వాటాను విక్రయించడానికి ప్రయత్నిస్తోందని చాలా కాలంగా బలమైన చర్చ జరిగింది.ఈరోజు ఈ అంశానికి ఆమోదం కూడా లభించింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ అదానీ విల్మార్ లిమిటెడ్ నుంచి నిష్క్రమించాలని అదానీ గ్రూప్ తన విక్రయాలను రెండు దశల్లో పూర్తి చేస్తుంది. అదానీ విల్‌మార్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ మొత్తం వాటా 44 శాతం కలిగి ఉంది.డిసెంబర్ 30న ఒప్పందంపై సంతకం చేసింది. ఒప్పందం ప్రకారం.. మొదటి దశలో.. అదానీ విల్మర్‌లో 31.06% వాటాను విల్మర్ ఇంటర్నేషనల్ పూర్తి యాజమాన్య సంస్థకు విక్రయించనుంది. పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని 13% వాటాను బహిరంగ మార్కెట్‌లో అమ్మనుంది. ఇదిలా ఉండగా.. సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో అదానీ విల్మార్ షేరు ధర రూ.329.50 స్థాయికి చేరుకుంది. గత రెండేళ్లలో కంపెనీ షేర్ల ధరలు 46 శాతం క్షీణించాయి. మరోవైపు.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు ఈరోజు 7 శాతం పెరిగి రూ.2593.45 స్థాయిలో కొనసాగుతున్నాయి. అయితే.. ఈ విక్రయం పూర్తయిన తర్వాత.. అదానీ కమోడిటీ నామినేట్ చేసిన డైరెక్టర్లు ఎమ్ఎమ్‌జీజీ కంపెనీ బోర్డు నుంచి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో.. కంపెనీ పేరు కూడా మారుతుంది. కాగా.. భారత వంట నూనెల మార్కెట్‌లో గణనీయ శాతం కలిగిన అదానీ విల్మర్, ఫార్చ్యూన్ బ్రాండ్ పేరిట వంట నూనెలు, ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులను విక్రయిస్తోంది. ప్యాకేజ్డ్ వంట సరకులను ఈ కంపెనీ అమ్ముతోంది.

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ ఓట్లు మీకే వేసుకోండి.. ఇంట్రెస్టింగ్ కామెంట్స్

రెడ్డిలు 12 మంది సీఎంలు అయ్యారని అన్నారు. కేసీఆర్ పేరు మీద లేదా పార్టీ మీద పోటీ చేద్దామనుకునే వారు వారికంటే దరిద్రులు ఇంకా ఎవరు లేరని చెప్పారు. కేసీఆర్ లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారని కేఏ పాల్ వెల్లడించారు. మరోవైపు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి కేఏ పాల్ కౌంటర్ ఇచ్చారు. పూలమ్మి.. పాలమ్మి అంత సంపాదించారా అని నిలదీశారు. ఇదిలా ఉంటే.. హైడ్రా పెద్ద డ్రామా అని ఆరోపించారు. రేవంత్, కేసీఆర్ తోడు దొంగలు అని దుయ్యబట్టారు. కేటీఆర్, రేవంత్ కొట్టుకోవడం.. తిట్టుకోవడం పెద్ద డ్రామానేనని కేఏ పాల్ అన్నారు.మరోవైపు.. అల్లు అర్జున్ ఎవరో తనకు తెలియదని.. ఆయన పేరు కూడా తెలియదన్నారు. చిరంజీవి, కృష్ణ తెలుసని చెప్పారు. పర్మిషన్ లేనప్పుడు అల్లు అర్జున్‌ను థియేటర్ లోపలికి ఎందుకు పంపారు.. ఆ హత్యలు మీకు భాగం లేదా అని కేఏ పాల్ ప్రశ్నించారు. ప్రజాశాంతి కండువాలు కప్పుకోవాలి.. తన ఫోటో పెట్టుకుని తిరగండని అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా గెలవండని కేఏ పాల్ తెలిపారు. రూ. 10 పెట్టి ప్రజాశాంతి పార్టీ సభ్యత్వం తీసుకోండని ప్రజలకు చెప్పారు.

# ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య యత్నం

**ఇబ్రహీంపట్నం,శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 :** ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక ఓ విద్యార్థిని గురుకుల హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామానికి చెందిన లావణ్య (14) ఇబ్రహీంపట్నం పరిధిలోని చర్ల పటేల్ గూడ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్ లో ఉంటూ 10వ తరగతి చదువుతుంది. కాగా విద్యార్థిని తరగతి గదిలో వెనకబడి ఉండడంతో పలుమార్లు ఉపాధ్యాయులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని లావణ్య నవంబర్ 9న హాస్టల్లో మొదటి అంతస్తు పై నుండి కిందికి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. దీంతో విద్యార్థినికి వెన్నెముకకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలై కదలలేని స్థితిలో ఉంది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఈనెల ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విద్యార్థిని ప్రమాదానికి గురిచేసిన ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని తన కుమార్తె కు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఫోకస్ - పోలీసు శాఖ

## - పోలీస్ సైరన్ తో పోకిరీల కు ఝలక్

### - రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా మారిన నల్గొండ పట్టణం




**చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్):** అర్ధరాత్రి వేళల్లో పనీపాటా లేకుండా రోడ్లపై తిరిగే ఆవారా వాళ్లకు ఖాకీలు చెక్ పెట్టారు. గడిచిన నెల రోజుల్లో పెద్ద మొత్తంలో న్యూసెన్స్, డ్రంక్ & డ్రైవ్ కేసులు నమోదు చేయడం తో రాత్రి వేళల్లో రొడ్డెక్కాలంటేనే పోకిరీలు జంకుతున్నారు.రాత్రి 10 దాటిందా అంతే.ఎక్కడివాళ్ళు అక్కడ గప్ చుప్.అత్యవసర పనుల నిమిత్తం వచ్చే వాళ్ళు తప్పా...ఆవారా గాళ్ళు రోడ్లపై కనిపించడం లేదు. గల్లీల్లో పోలీస్ సైరన్ వినబడితే చాలు....పోకిరీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తాజాగా రాత్రివేళల్లో పోలిసుల స్పెషల్ డ్రైవ్ లతో రోడ్లు, గల్లీలు మొత్తం నిర్మానుష్యంగా మారాయి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని... నేర నియంత్రణ కోసమే ఇలాంటి చర్యలకు శ్రీకారం చుట్టామంటున్నారు ఎస్పీ శరత్ చంద్రపవార్ ఐపీఎస్. రాత్రి వేళల్లో పోలీసుల స్పెషల్ డ్రైవ్ లు నిత్యం కొనసాగుతూనే ఉంటాయని చెబుతున్నారు.

**పోలీసులు ప్రత్యేక దృష్టి**

న్యూ ఇయర్ వేడుకలపై ప్రత్యేకంగా నిఘా వేసిన పోలీసు శాఖ. డ్రగ్ రహిత, బార్లు, రెస్టారెంట్లు, హెూటల్లపై పోలీసు శాఖ ఓ కన్నేసి ఉంచింది. పోలీసు తో పాటు ఎక్సైజ్ అధికారులు అలర్ట్ అయ్యాయి.

**మైనార్టీలను అనుమతిస్తే కేసులు**

కొత్త ఏడాది వేడుకలో మైనరను బార్లు, రెస్టారెంట్లు, హెూటల్లపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. డీజేలతో హంగామా చేయవద్దని,నిషేధానికి సహకరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌండ్ పొల్యుష్యన్ కు కారణం కాకుండా చూసుకోవాలని యాజమానుల కు ఆదేశాలిచ్చారు.

# రేవంత్ రెడ్డికి గుడ్ న్యూస్ చెప్పిన సత్య నాదెళ్ల



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగిస్తామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు.హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో ఆయనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం భేటీ అయింది. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. నైపుణాభివృద్ధి,మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడి హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్య నాదెళ్లకు తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని, హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపివేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐ,, క్లౌడ్‌తో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్లకు విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# హైకోర్టులో ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు విచారణ.. కేటీఆర్ అరెస్ట్‌పై ఉత్కంఠ!

హైకోర్టులో ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు విచారణ జరగనుంది. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను హైకోర్టు విచారించనుంది. రేపటితో కేటీఆర్ ను అరెస్ట్ చేయకూడదన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ముగియనున్నాయి.కేటీఆర్ ను అరెస్ట్ చేయకూడదన్న మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేయాలని ఏసీబీ కోర్టును మరోసారి కోరనుంది. రాజకీయ కక్షతో ఈ కేసులో తనను ఇరికించారని కేటీఆర్ సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా.. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఈ నెల 27న హైకోర్టు విచారించింది. కేటీఆర్ అరెస్టుపై జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ కోరింది. కాగా.. కేటీఆర్‌ను అరెస్ట్ చేయరాదన్న ఆదేశాలను ఈ నెల 31 వరకు పొడిగిస్తూ.. హైకోర్టు తీర్పు వెలువరించింది. అనంతరం విచారణను కోర్టు ఈ నెల 31కి వాయిదా వేసింది. కాగా.. ఇప్పటికే ఈ కేసులో దానకిషోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉన్న దృష్ట్యా ఏ1 కేటీఆర్, ఏ2 అరవింద్ కుమార్, ఏ3 బీఎల్ఎన్ రెడ్డిలకు ఏసీబీ ఇంకా నోటీసులు జారీ చేయలేదని సమాచారం. అయితే వారందరికీ నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అధికారులు సిద్ధం చేశారు.

## 'తెలుగుతల్లికి జలహారతి'... భారీ ప్రాజెక్టు పేరు ప్రకటించిన సీఎం చంద్రబాబు

ఏపీ ప్రభుత్వం భారీ ఎత్తున తీసుకువస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టు పేరును ప్రకటించారు. 'తెలుగుతల్లికి జలహారతి' అని ప్రాజెక్టు పేరు వెల్లడించారు. ప్రాజెక్టు గురించి చెబుతూ, రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగితే రతనాల సీమ అవుతుందని అన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తరచుగా కరవు బారినపడుతున్నాయని వివరించారు. పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాల నీటి వినియోగం కారణంగా... కృష్ణా నదిలో తగినంత నీటి లభ్యత ఉండడం లేదని వివరించారు. ఒక్క గోదావరి నదిలో మాత్రమే ఆశించిన మేర జలాలు అందుబాటులో ఉంటున్నాయని చంద్రబాబు తెలిపారు.గోదావరి నీటిని మళ్లించలగితే రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చని పేర్కొన్నారు. నదులు అనుసంధానం చేయగలిగితే రాష్ట్ర వ్యవసాయ రంగానికి నీటి కొరత అనే మాట వినిపించదని స్పష్టం చేశారు. గోదావరి నుంచి కనీసం 300 టీఎంసీల నీటిని కృష్ణా నదికి తీసుకురావడం... కృష్ణా పశ్చిమ, తూర్పు డెల్టాలకు నీళ్లు ఇచ్చిన తర్వాత ఇక్కడ్నించి బనకచర్లకు నీటిని తీసుకువెళ్లడం ఈ ప్రాజెక్టులో ప్రధానమైన అంశం. ఇది మూడు దశల్లో ఉంటుంది. దీనిద్వారా వెలుగొండ ఆయకట్టు కూడా కవర్ అవుతుంది. నాగార్జునసాగర్ కుడి కాలువపై బొల్లాపల్లి ప్రాజెక్టు వస్తుంది... ఆ తర్వాత వెలుగొండ ప్రాజెక్టు... అక్కడ్నించి బనకచర్ల ప్రాజెక్టుకు నీళ్లు వెళతాయి. నల్లమల అడవులను కొంతమేర నరికి టన్నెల్ ఏర్పాటు చేసిన బనకచర్లకు నీళ్లు తీసుకువెళతాం. ఇదంతా జరిగితే నదుల అనుసంధానం పూర్తవుతుంది. ఈ నదుల అనుసంధానం ప్రక్రియలో ఇవే కాకుండా మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రాజెక్టు ఏపీకి ఒక గేమ్ చేంజర్. అందుకే దీనిపేరు కూడా తెలుగుతల్లికి జలహారతి అని నామకరణం చేశాం. అంటే మనం సమర్పించుకోవడం. కన్నతల్లికి రుణం తీర్చుకోవడం అనే అర్థంలో ఈ పేరు పెట్టాం. ప్రధాని మోదీకి ఈ ప్రాజెక్టు నివేదికను పంపిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు.

## శ్రీవారి దర్శనం...చంద్రబాబు లేఖపై స్పందించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను టీటీడీ అనుమతించేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆ లేఖపై స్పందించిన చంద్రబాబు... టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో కలిసి చర్చించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తమ నిర్ణయాన్ని నేడు తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేశారు.ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నుంచి ప్రతివారం ఏదైనా రెండు రోజుల్లో (సోమవారం నుంచి గురువారం వరకు) వీఐపీ బ్రేక్ దర్శనం (రూ.500/- టికెట్) కొరకు రెండు లేఖలు, స్పెషల్ ఎంట్రీ దర్శన్ (రూ. 300/- టికెట్) కొరకు రెండు లేఖలు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. ప్రతి లేఖతో ఆరుగురు భక్తుల వరకు దర్శనానికి సిఫార్సు చేయొచ్చని చంద్రబాబు తెలంగాణ సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడినట్లుగా ఉంది...ఎవరూ చెప్పడం లేదు: బండి సంజయ్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి, సినీ నటుడు అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడినట్లుగా తనకు అనుమానం కలుగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కానీ ఎక్కడ చెడిందో ఇద్దరిలో ఎవరూ చెప్పడం లేదన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... సంధ్య థియేటర్ ఘటన, నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, అలాంటప్పుడు అసెంబ్లీలో చర్చ ఎందుకని ప్రశ్నించారు.పుష్ప-3 సినిమా రాకముందే సీఎం రేవంత్ రెడ్డి పుష్ప-3ని చూపించారని చురక అంటించారు. ఈ సినిమాకు 1,700 కోట్ల కలెక్షన్లు వచ్చాయని, జాతీయస్థాయిలోనూ ఈ సినిమాకు పేరు వచ్చిందన్నారు. తెలంగాణలో చాలామంది హీరోలు ఉన్నారని... కానీ అల్లు అర్జున్ పట్ల ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. వారి మధ్య ఎక్కడో చెడిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలును పక్కదారి పట్టించేందుకే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని విమర్శించారు.

## సినిమావాళ్లతో రేవంత్ రెడ్డి సెటిల్ చేసుకున్నారు: అల్లు అర్జున్ వ్యవహారంపై మరోసారి స్పందించిన కేటీఆర్

సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి స్పందించారు. కేవలం ప్రచారం కోసమే సీఎం రేవంత్ రెడ్డి సినిమా వాళ్ల గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. హామీలు, సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారన్నారు. నిత్యం అటెన్షన్, డైవర్షన్ కోసమే సీఎం పాకులాడుతున్నారని విమర్శించారు. సినిమా వాళ్లతో రేవంత్ రెడ్డి సెటిల్ చేసుకున్నారని, అందుకే ఇప్పుడేమీ మాట్లాడటం లేదన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిచ్చాపాటిగా మాట్లాడుతూ... గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. రైతన్నలు, నేతన్నల మరణాలపైనా సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.తనపై ఏసీబీ నమోదు చేసిన కేసులో బలం లేదని సీఎం రేవంత్ రెడ్డికి తెలుసన్నారు. బీఆర్ఎస్ క్యాడర్‌లో ఇప్పుడు విశ్వాసం, ఆత్మస్థైర్యం కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం పెట్టిన కేసులకు భయపడేది లేదన్నారు. ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో తాను ఎక్కడా మాట మార్చలేదన్నారు. చెప్పినదానికే కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఈ-కార్ రేసు విషయంలో మంత్రి హెూదాలోనే తానే డబ్బులు చెల్లించమన్నానని తెలిపారు.నిబంధనల ప్రకారం చెల్లింపులు జరగకుంటే ఈసీ, ఆర్బీఐ వద్దకు ప్రభుత్వం ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. డబ్బులు ముట్టిన వారిపై కేసులు ఎందుకు పెట్టలేదో చెప్పాలన్నారు. ప్రభుత్వం కేసులతో భయపెట్టాలని చూస్తోందని, వాటిని ఎదుర్కొంటామన్నారు. ఈడీ నుంచి తనకు నోటీసు వచ్చిందన్నారు. ఈ విషయమై తాను కోర్టులో చెబుతానన్నారు. తన విషయంలో అత్యుత్సాహం కనిపిస్తోందన్నారు. తాను ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తున్నానన్నారు. కోర్టు చెబితే ఈడీ, ఏసీబీ ఇక ఏదీ ఉండదన్నారు.ఎప్పుడు బయటకు రావాలో కేసీఆర్‌కు తెలుసని కేటీఆర్ అన్నారు. ఆయన 24 ఏళ్లు కష్టపడ్డారని, ప్రస్తుతం కాస్త విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పారు. 2025లో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎన్నిక, సంస్థాగత కమిటీని వేస్తామన్నారు. తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావుపై కాంగ్రెస్ వివక్ష చూపుతోందని ఆరోపించారు. ఢిల్లీలో పీవీకి మెమోరియల్ కట్టాలని అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీలు రక్షణ కవచంగా మారారని ఎద్దేవా చేశారు. అమృత్, సివిల్ సప్లై స్కాంలలో కేంద్రం ఎందుకు విచారణ జరపడం లేదని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని కేటీఆర్ ధీమాగా చెప్పారు. రైతు భరోసా ఇస్తామని ప్రచారం చేస్తున్నారని, కానీ ఈ సంక్రాంతికి కాంగ్రెస్ టోకరా ఇవ్వబోతుందన్నారు. రేవంత్ ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేదన్నారు.

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867
తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

# తెలంగాణ జిల్లాలు



## రోడ్డు ప్రమాదాలకు అడ్డుగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్, కంప చెట్లను తొలగించాలి:

### సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ



**చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్):** రోడ్డు ప్రమాదాలకు అడ్డుగా ఉన్న ట్రాన్స్ఫార్మర్, కంప చెట్లను తొలగించాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. సోమవారం నేర్మట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,నేర్మట, ధోని పాముల రోడ్డు వెంటకంప చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. ఈ సమస్యపై గతంలో ఎన్నోసార్లు అధికారులకు చెప్పినప్పటికీ గతంలో ఒకసారి కంపచెట్లను తొలగించారని, మళ్లీ వానలు పడటంతో విపరీతంగా పెరిగాయని వెంటనే అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ రోడ్డు పక్కన ట్రాన్స్ ఫార్మర్ ఉండడంతో ప్రమాదాలు జరగడానికి అవకాశముందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు వెంటట్రాన్స్ఫార్మర్, కంప చెట్లు వెంటనే తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ రోడ్డు వెంట కంప చెట్లను, ట్రాన్స్ ఫార్మర్ తొలగించకపోవడంతో పలు ప్రమాదాలకు కారణం అవుతున్నాయని ఆయన అన్నారు. ఈ రోడ్డు మార్గాన్ని ఇరువైపుల వైశాల్యం పెంచి రోడ్డు విస్తరణ చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు నివారించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈరటి వెంకటయ్య, బల్లెం స్వామి, యాదయ్య, గుయ్యని పండు, తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్):** న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు చండూర్ సి.ఐ. ఆద్వర్యంలో ఎస్.ఐ. వెంకన్న నేతృత్వంలో న్యూ ఇయర్ వేడుకలు చండూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకన్న మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చుట్టు పక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని, యువత మద్యం సేవించి, డీజేలు పెట్టి నృత్యాలు చేస్తూ, వాహనాలు అతివేగంతో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు న్యూ ఇయర్ వేడుకల్లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విందులు, వినోదాలు అంటూ ఎంజాయ్ చేసే క్రమంలో అర్ధరాత్రి దాటిన తర్వాత కేక్ కటింగ్ లు పెటాకులు కాల్చి మత్తు పానీయాలు సేవించి విచ్చలవిడిగా విహరిస్తే కఠిన చర్యలు తప్పవని, తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తామని ఎస్సై వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు ప్రమాదలకి అడ్డగా ట్రాన్స్ పార్మర్, కంపచెట్లును వెంటనే తొలగించాలి





**చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్) :** చండూర్ మండలంలోని దోనిపాముల నుండి నెర్మట కు వెల్లు దారిలో ముత్యాలమ్మ చెరువు కట్ట క్రింది ట్రాన్స్ పార్మర్ రోడ్డుకు దగ్గరగా ఉండటంతో పలు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ట్రాన్స్ పార్మర్ ను పక్కకు మార్చి, కపచెట్లను, పిచ్చి మొక్కలను తోలగించి, వాహన చోదకులను, ప్రయాణికులను పలు యాక్సిడెంట్ లు కాకుండా చూడాలని నెర్మట ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని రోడ్డు ప్రయాణానికి అడ్డంకిగా మారిన ఈ పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి కట్టకు మలుపు దగ్గరలోని ప్రాంతంలో ప్రమాదకర మూలమలుపు ఉందని ఈ మూలమలుపు వద్దన కంప చెట్లను మొక్కలు సిసి రోడ్డుని కప్పి వేయడంతో ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించలేక ఇటీవల పలు యాక్సిడెంట్ జరిగాయని తెలిపారు. వెంటనే రోడ్డు మార్గాన్ని ఇరువైపుల వైశాల్యం మేరకు రోడ్డు విస్తరణ చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయన ఉన్నతాధికారులను కోరుతు, నెర్మట గ్రామ రైతు సహకార సంఘం మాజి బ్యాంక్ డైరెక్టర్ బాణాల నర్సింహ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దాసరి ఆంజనేయులు, నారపాక పెద్ద ముత్తయ్య, నారపాక ఆంజనేయులు, శివలింగం, గుంటోజు కిషోర్,తదితరులు, ఒక ప్రకటనలో తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలి

- తాగి వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు
- వేడుకల్లో అశ్లీషా నృత్యాలపై నిషేధం
- డ్రగ్స్, గంజాయి సరపర చేస్తే కఠినమైన చర్యలు
- యువత మత్తుకు చిత్తు కావొద్దు, తల్లిదండ్రుల సంతోషాన్ని పంచుకోవాలి
- యాచారం సీఐ నరసింహారావు




**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 30):.** యాచారం మండలంలో ప్రజలందరూ న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని యాచారం సీఐ నరసింహారావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... న్యూ ఇయర్ వేడుకలపై డిజిపి ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ చేసే నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్ లో సీసీ కెమెరాలు తప్పనిసరి గా ఉండాలి. వేడుకల్లో అశ్లిత నృతయలపై నిషేధం విధించారు. బార్లల్లో వైన్స్ లలో మైనర్లకు అనుమతి లేదన్నారు. యువతీ యువకులు వాహనాలు నడపరాదు. ఒకవేళ వాహనాలు నడిపితే 10 వేలు జరిమాన ఆరు నెలలు జైలు శిక్ష ఉంటుందని తెలియజేశారు. యువతి యువకులు డ్రగ్స్ కు, గంజాయి వాడొద్దని హెచ్చరించారు. ఒకవేళ పట్టుబడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాలలో ఎక్సైజ్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలు ఉంటాయని ప్రకటించారు. మద్యం దుకాణాలు, కొనుగోళ్లపై ప్రత్యేకంగా నిగా ఉంటుందని అన్నారు.న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరికి 31 శుభాకాంక్షలు యాచారం సీఐ నరసింహారావు, ఎస్సైలు మధు, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు తెలియజేశారు.

## విద్యార్థులకు సమాజంపై అవగాహన తప్పనిసరి





- ప్రధానోపాధ్యాయుడు నరసింహ
- మండల స్థాయి పోటీ పరీక్షల్లో సాంఘిక శాస్త్రం చాలా కీలకం
- మైపాల్ రెడ్డి
- పోటీ పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం

**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 30):.** విద్యార్థులకు విద్యతో పాటు సమాజంపై అవగాహన తప్పనిసరి అని యాచారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహ, సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాచారం ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి సోషల్ టాలెంట్ పరీక్ష సాంఘిక శాస్త్రం, ఉపాధ్యాయులు భోజయ్య, వెంకట్ రెడ్డి సహకారంతో నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల నుండి 36 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. సమాజంలో జరిగే అనేక సాంఘిక కార్యకలాపాలకు సామాజిక చైతన్యం కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులు సామాజిక విలువలు కలిగి ఉండాలని ఇలాంటి పరీక్షలు పెట్టడం జరిగిందన్నారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో ప్రథమ స్థానంలో మేడిపల్లి నక్కర్త విద్యార్థి ఉష, ద్వితీయ స్థానంలో యాచారం విద్యార్థి సాయి ప్రణీత్, తృతీయ స్థానంలో నంది వనపర్తి విద్యార్థి హారిక ప్రథమ స్థానంలో నిలిచారు. మీడియా విభాగంలో ప్రతమ్మ తృతీయ స్థానాల్లో కుర్మిద్ద విద్యార్థులు శ్రీనాథ్, శ్రీజ, తృతీయ స్థానంలో గునుగల్ విద్యార్థి అనిల్ గెలుపొందారు. రెసిడెన్షియల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో గునుగల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు నికిత, భాను ప్రసాద్, హేమంత్ నిలిచారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు జనవరి 4వ తేదీన సాహెబ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ పరీక్షకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్మోహన్ రెడ్డి, కిషన్, శ్రీనివాస్, పాండు నాయక్, రాజు, పద్మలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించాలి: సిపిఎం

### చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ



**చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు పైన దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పి మంత్రి పదవి నుండి వైదొలగాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు.సోమవారం చండూరు మండల కేంద్రంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను బర్త్ రఫ్ చేయాలని సిపిఎం చండూరు మండల కమిటీ, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలని, సామాజిక,ఆర్థిక, సంస్కృతిక రంగాలలో జాతి నిర్మాణం కోసం పాటుపడిన అంబేద్కర్ పట్ల రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కేంద్రమంత్రి అమిత్ షా అవహేళనగా మాట్లాడడం యావత్ దేశ ప్రజలందరినీ అవమానపరచడమేనని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగం ద్వారా సర్వ హక్కులు కల్పించి సమానత్వం కోసం పనిచేసిన అంబేద్కర్ ను ప్రజలు దైవంగా భావిస్తున్నారని ఆయన అన్నారు. అలాంటి మహనీయుని పట్ల అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో 2017లో గతంలో నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఉన్న పేదవారికి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇస్తామన్న తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చిట్టి మల్ల లింగయ్య, సిపిఎం నాయకులుఈరటి వెంకటయ్య, స్వామి, బి. వెంకన్న,రాచమల్ల లక్ష్మయ్య,హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సాయం కృష్ణయ్య, బొమ్మరగొని సుమన్,కోట్ల రమేష్, సోము అంజి, నరేష్, నలపరాజు నరసింహ, పాశం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నలుమూలల నుండి కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి కి 50 ఫిర్యాదులు

- కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.





**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రేట్, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 :** సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (50) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ - 31, పిడి హౌసింగ్ - 10, డీపీఓ-02, మున్సిపల్-02, ల్యాండ్ ప్రొటెక్షన్ -02, విద్యుత్తు -01, ఎండోమెంట్ - 02, మొత్తం 50 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దండు మైలారంలో బిజెపి బూత్ అధ్యక్షుల నియామకం



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం దండుమైలారం గ్రామంలో బూత్ అధ్యక్షుల నియామకానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కరీంనగర్ జిల్లా ఇన్చార్జ్ నిట్టు శ్రీశైలం.భారతీయ జనతాపార్టీ రాచకొండ దండుమైలారం లో బూత్ నెంబర్ 175,176, 177, 178, 179, గల బూతు అధ్యక్షుల నియామకము భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్రఅధికార ప్రతినిధి కరీంనగర్ జిల్లా ఇన్చార్జ్ నిట్టు శ్రీశైలం ఆధ్వర్యంలో బూతు అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. ఈకార్యక్రమము లో భాగంగా

175 జంగం వెంకట్ రెడ్డి అధ్యక్షుడు,
176 చింతల కృష్ణ మురుదిరాజ్ అధ్యక్షుడు,
177 పొట్ల చెరువు మధు కుమార్ రజక అధ్యక్షుడు,
178 ఉదారి శివకుమార్ ముదిరాజ్ అధ్యక్షుడు,
179 తుంకోజి మమతాచారి అధ్యక్షురాలు గా ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం బిజెపి మండల అధ్యక్షులు దండే శ్రీశైలం యాదవ్, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యులు తుంకోజు సాయికుమార్ చారి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఓబీసీ మోర్చా కన్వీనర్ రమేష్ చారి, బిజెపి సీనియర్ నాయకులు చింతల నరసింహ్మ ముదిరాజ్, పట్నం శ్రీశైలం, ఎల్కరాజు గణేష్ రజక, ఈదుల కంటి శివ కుమార్ గౌడ్, బూత్ కమిటీ సభ్యులు బిజెపి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## మిషన్ భగీరథ మంచినీటి సరఫరాకు అంతరాయం

### ప్రజలందరూ అర్థం చేసుకోవాలి

### ఎంపీడీవో నరేందర్ రెడ్డి

**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 30):.** మిషన్ భగీరథ , గౌరీ దేవి పల్లి.. 220 కెవి సబ్ స్టేషన్ లో మరమ్మత్తు పనుల వలన ముచ్చర్ల వాటర్ పైపులైనుకు నీటి సరఫరా కాకపోవడంతో మంచాల, ఇబ్రహీంపట్నం, యాచారం, అబ్దుల్లాపూర్మెట్, శంషాబాద్, కందుకూరు, మహేశ్వర మండలాలో సోమవారం మధ్యాహ్నం నుండి మంగళవారం ఉదయం 11 గంటల వరకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. పైన తెలిపిన మండలాల ప్రజలందరూ గమనించి, మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. మీ యొక్క గ్రామపంచాయతీలలో బోర్ వాటర్ ని , ఉపయోగించుకోవాలని కోరారు.

## మునుగోడులో రాత్రి పూట తృటిలో తప్పిన పెను ప్రమాదం





**చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్) :** మునుగోడు గ్రామ శివారులో అదుపు తప్పి బావిలో పడ్డ బొలెరో వాహనం. విషయం తెలుసుకున్న మునుగోడు ఎస్సై ఇరుగు రవి మాట్లాడుతూ వీరిది కట్టంగూరు మండలం, దుగినెల్లి గ్రామం కారులో వున్న నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారుగా గుర్తింపు బావిలో పడ్డ వారిలో భర్త - జాడిగల రాజు, భార్య -పుష్పలత ,ఇద్దరు మగ పిల్లలు క్షేమంగా బయటపడిన్నారని అన్నారు. మునుగోడు నుండి నార్కట్ పల్లికి వెళ్తుండగా మునుగోడు గ్రామ శివారులోనీ వడ్డెరగూడెం దగ్గర గల మూల మలుపు వద్ద వున్న బావిలో పడ్డ కారు బావిలో నీరు లేకపోవడంతో తప్పిన ప్రమాదం స్థానికుల సహాయంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా వారిని బయటకు తీసి, అంబులెన్స్ లో ఎక్కించి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించిన ఎస్సై ఇరుగు రవి, పోలీసు సిబ్బంది.

# కాంగ్రెస్ నాయకుడు జావీద్ అలీ నివాసంలో తేనీటి విందు



జహీరాబాద్ నియోజకవర్గం శాసన సభ దినపత్రిక డిసెంబర్ 30 : కాంగ్రెస్ నాయకుడు మరియు జెజె కన్స్ట్రక్షన్స్ అధినేత జావీద్ అలీ నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పలువురు ముఖ్య వ్యక్తులు పాల్గొన్నారు. ఈ విందులో కేంద్ర మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్ , ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ , యంపి సురేష్ కుమార్ షేట్కర్ పాల్గొని, జావీద్ అలీ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామలింగారెడ్డి, మక్సుద్, శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ హర్షద్ అలీ, టౌన్ ప్రెసిడెంట్ కండెం నర్సింహులు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, ఉగ్గెల్లి రాములు, ముజహిత్ సేట్ మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో ఘనంగా మాజీ మంత్రి ఫరీదుద్దీన్ వర్ధంతి



జహీరాబాద్, శాసన సభ న్యూస్ డిసెంబర్ 30 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మాజీ మంత్రి, స్వర్గీయ ఎం డి ఫరీదుద్దీన్ మూడో వర్ధంతి కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి, స్థానిక ఎంఎల్ఏ కె. మాణిక్ రావు, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ఫరీదుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫరీదుద్దీన్ తనయుడు మాజీ ఇండస్ట్రీస్ చైర్మన్ ఎండి.తన్వీర్ ను కలిసి మాట్లాడారు. అయన సేవలను నెమరేసుకున్నారు. ఫరీద్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. సౌమ్యుడిగా పేరు గడించారని, అందరితో కలిసిపోయే స్వభావం కలిగిన గొప్ప నేత అన్నారు. అయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తండ్రి బాటలో పయనిస్తున్న తన్వీర్ ను అభినందించారు. ఇదిలా ఉండగా వర్ధంతి కార్యక్రమంలో అయా సంఘాల శ్రేణులు, వివిధ పార్టీల నాయకులు, ఫరీదుద్దీన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు. ఫరీద్ సాబ్ అమర్ హై అంటూ అభిమానులు పెద్ద పెట్టున నినాదాలు చేసారు. ఆ ప్రాంగణం జన జాతరగా కానవచ్చింది. అయా ప్రాంతాలు, గ్రామాల నుండి వచ్చిన జనానికి భోజన సదుపాయాలు కల్పించారు.

# వైద్యుడి దాతృత్వం... పాఠశాలకు లక్ష రూపాయల విరాళం

## ఒక్క రూపాయితో వైద్య సేవలు అందించిన ఘనత ఆంజనేయ శాస్త్రి ఆయనదే




కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ డిసెంబర్ 30 : కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన 48 సంవత్సరాలుగా మండల ప్రజలకు వైద్య సేవలు అందించిన డాక్టర్ వేదం ఆంజనేయ శాస్త్రి కొండమల్లేపల్లి పట్టణంలో లక్ష్మీ క్లినిక్ పేరుతో 1977 సంవత్సరంలో హాస్పిటల్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయితో వైద్య సేవలు అందించేవారు. అప్పటినుండి ఇప్పటివరకు మండల ప్రజలకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యం అందించి అందరి మన్ననలు పొందారు. తన భార్య వేదం అరుణ గత కొన్ని సంవత్సరాల క్రితం అకాల మరణం పొందారు. అప్పటినుండి ప్రతి సంవత్సరం విద్యార్థులకు, పేదవారికి దానధర్మాలు చేసుకుంటూ వచ్చేవారు. కొండమల్లేపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం తన అనుచరుడు కృష్ణయ్య ద్వారా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామావత్ నాగేశ్వరరావుకు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు వారిని అభినందించారు. ఈ డబ్బులను 9వ తరగతి చదివే విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వాల్సిందిగ ఆయన సూచించారు.

# సీపీఐ నల్లగొండ బహిరంగ సభకు భారీగా తరలిన ఎర్ర సైన్యం








దేవరకొండ, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 : నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్జీ కళాశాలలో జరిగిన సీపీఐ 100 సంవత్సరాల భారీ బహిరంగ సభకు దేవరకొండ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో సీపీఐ ఎర్ర సైన్యం కధం తొక్కుతూ,పదం పడుతూ ఎర్ర జండాలను చేతబట్టి దేవరకొండ పట్టణంలో డప్పు చెప్పుళ్లతో ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు ధరించి కళాకారుల డప్పు దరువులు ఆటపాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అన్ని మండలాల నుండి భారీ సంఖ్యలో హాజరైన సిపిఐ పార్టీ శ్రేణులు తరలివెళ్తున్న వాహనాలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ్మ రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహ్మ రెడ్డి మాట్లాడుతూ 100 వసంతాల సీపీఐ నల్లగొండ బహిరంగ సభకు నియోజకవర్గ సీపీఐ పార్టీ శ్రేణులు నూతన ఉత్తేజంతో నల్లగొండ సభకు అనుకున్న విధంగా హాజరు కావడం శుభ పరిణామమని క్యాడర్ తరలిరావడానికి కృషి చేసిన మండల పార్టీ కార్యవర్గానికి, ప్రజా సంఘాల నాయకులను నర్సింహ్మ రెడ్డి అభినందించారు.

# తుక్కుగూడకు చేరిన ఆశ వర్కర్ల బస్సు జాత






ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 : ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం 18 వేల రూపాయల వేతనం నిర్ణయించాలని ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆశ వర్కర్ల బస్సు జాత సోమవారం నాడు రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ గ్రామానికి చేరుకుంది. ఈ బస్సు జాత టీంలో ఆశ వర్కర్ల యూనియన్( సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఆర్ సాధన, టి గంగమని, ఆరు లీలా దేవి, ఎన్ పద్మ ఎం బాలమణి, కే సునిత ఉన్నారు. టీంకు ఆశ వర్కర్లు బతుకమ్మ లతో ఘనంగా స్వాగతం పలికగా తుక్కుగూడ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్,సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్,శ్రామిక మహిళా రంగారెడ్డి జిల్లా కన్వీనర్ జి. కవిత పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వై స్వప్న, నాయకులు బుట్టి బాలరాజు, బాలాపూర్ శేఖర్, పోచమోని కృష్ణ,జే పెంటయ్య,శేఖర్ ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా, మండల నాయకులు సుశీల, జయసుధ,ముంతాజ్,ప్రేమలత,రేణుక, లక్ష్మి దేవి,అనిత, విజయ, భాగ్య,రజినీ,నిర్మల, కవిత,లావణ్య,సభిత, గీత,వనిత,రజిత, వై.కవిత మహేశ్వరం,కందుకూరు, తలకొండ పల్లి,శంషాబాద్, బాలాపూర్,మంచాల, ఇబ్రహింపట్నం మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి మండల కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ 55వ ఆవిర్భవ వేడుకలు




కొండమల్లేపల్లి శాసనసభ డిసెంబర్ 30 : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థి ఉద్యమ కెరటం ఎస్ఎఫ్ఐ 1970 నుండి ఇప్పటివరకు 55 సంవత్సరాల అమరుల త్యాగాల బలిదానాల నుండి నిలబడ్డ తెల్లజెండాలో ఎర్ర చుక్క ఎస్ఎఫ్ఐ పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రామావత్ లక్ష్మణ్ నాయక్ బుడిగ వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమానికి బుడిగ వెంకటేష్ హాజరై స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను డివిజన్ అధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్ ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ 1970లో డిసెంబర్ నెలలో ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో ఏర్పడిందన్నారు విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ ఈ భారత దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం గా అవతరించిందన్నారు నాటి నుండి నేటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఈ భారత దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు వెళుతుందన్నారు దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు. ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్య రంగాన్ని దెబ్బతీసే కుట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నర దగ్గరికి వస్తున్న కూడా ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్యశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య సమస్యలను బాగుచేయలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ముఖ్య భూమిక పోషించిన పేద మధ్యతరగతి విద్యార్థులకు గత బి ఆర్ యస్ ప్రభుత్వం స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందిన్నారు. కావునా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేద మధ్యతరగతి విద్యార్థుల పక్షాన నిలబడి వారి చదువులు ముందు పోవాలంటే గత పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలని చెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తన వద్దనే వుంచుకున్న విద్యాశాఖ ను పటిష్టం చేయడానికి ఎవరి మీద నమ్మకం లేక నావద్దనే వుంచుకున్నాను చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ కు ఇంటర్, డిగ్రీ, పిజి, బిటెక్ ఇతర కోర్సుల కళాశాలలో చదివే విద్యార్థుల గోడు ప్రభుత్వాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులు ముందు పోవాలంటే ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలో చదువుకునే ప్రతి విద్యార్థి ఆర్టిఎఫ్ ఎం టి ఎఫ్ పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తే విద్యార్థుల జీవితాలతో వెలుగులు నిండుతాయి అని అన్నారు. లేదంటే దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఇద్ది రాములు, కొర్ర దినేష్, రామావత్ శరత్, రోహిత్ గదేపాక పూజ మంజుల నందిని సరస్వతీ చరణ్ వెంకటేష్ మహేష్ మల్లేష్ రాహుల్ సందీప్ రాజ్ కుమార్ లయ అనూష ప్రవళిక రవళి రమ్య తదితరులు పాల్గొన్నారులి

# పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## - చింతపల్లి ఏబీవీపీ మండల కన్వీనర్ సన్నాయిల మహేష్.





చింతపల్లి,శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చింతపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. విద్యార్థులను నిరుద్యోగ యువతను ఉద్ధరిస్తామని ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖను ఏమాత్రం పట్టించుకోవడం లేదని చింతపల్లి మండల ఏబీవీపీ కన్వీనర్ సన్నాయిల మహేష్ అన్నారు. కనీసం విద్యాశాఖకు మంత్రిని నియమించక పోవడం సిగ్గుచేటని పేద విద్యార్థుల జీవితాలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టిస్తే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యాశాఖను అలాగే కొనసాగించి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏబీవీపీ చింతపల్లి మండల కన్వీనర్ సన్నాయిల మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రేన్ వాహనంతో ఢీకొట్టగా వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 30 : నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని క్రేన్ వాహనంతో డ్రైవర్ ఢీకొట్టగా దుర్మరణం చెందిన సంఘటన తుర్కయంజాల్ రాగన్నగూడ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేది 30 06:45 నిమిషాలకు గణేష్ టెంపుల్ దగ్గర రాగన్నగూడలో రోడ్డు పక్కనుండి బండారు జంగయ్య అనే వ్యక్తి 53 నడుచుకుంటూ వెళ్తుండగా %టూ 06 జుూ% 8341 క్రేన్ డ్రైవర్ ఢీకొట్టాడు. గాయపడిన వ్యక్తి తలకు, శరీరానికి తీవ్ర గాయాలై రక్తస్రావం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. అనంతరం మృతుడి వివరాలను చుట్టుపక్కల ఆరా తీయగా అతని పేరు బండారి జంగయ్య, తండ్రి క్రీ.శే ఎల్లయ్య వృత్తి కూలీ నివాసం జివిఆర్ కాలనీ రాగన్నగూడ. సింగంపల్లి గ్రామం, ఆమనగల్ మండలం. రంగారెడ్డి జిల్లా అని పోలీసులు తెలిపారు. శవ పంచానామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

## - గట్టుప్పల్ సబ్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ రెడ్డి



చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్) : న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గట్టుప్పల్ సబ్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని, యువత మద్యం తాగి, డీజే లు పెట్టి నృత్యాలు చేస్తూ, వాహనాలు అతివేగంతో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు న్యూ ఇయర్ వేడుకల్లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విందులు, వినోదాలు అంటూ ఎంజాయ్ చేసే క్రమంలో అర్ధరాత్రి దాటిన తర్వాత కేక్ కటింగ్ లు పటాకులు కాల్చి మత్తు పానీయాలు సేవించి విచ్చలవిడిగా విహరిస్తే కఠిన చర్యలు తప్పవని, తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్య వేక్షిస్తారని తెలిపారు.

# న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

## - మునుగోడు సబ్ ఇన్స్పెక్టర్ ఇరుగు.రవి



చండూర్ డిసెంబర్ 30 (శాసనసభ న్యూస్) : న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మునుగోడు సబ్ ఇన్స్పెక్టర్ ఇరుగు.రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని, యువత మద్యం తాగి, డీజే లు పెట్టి నృత్యాలు చేస్తూ, వాహనాలు అతివేగంతో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు న్యూ ఇయర్ వేడుకల్లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విందులు, వినోదాలు అంటూ ఎంజాయ్ చేసే క్రమంలో అర్ధరాత్రి దాటిన తర్వాత కేక్ కటింగ్ లు పటాకులు కాల్చి మత్తు పానీయాలు సేవించి విచ్చలవిడిగా విహరిస్తే కఠిన చర్యలు తప్పవని, తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తారని తెలిపారు.

# ఏపీ పంట పండింది...
## మరో వరం ప్రకటించిన నరేంద్రమోడీ



**శాసనసభ / హైదరాబాద్ :** కేంద్రంలో, రాష్ట్రంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వాలే ఉండటంతో అభివృద్ధి సజావుగా జరుగుతుందని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పలు పథకాలకు సంబంధించి ఏపీని ఎంపిక చేయడంతోపాటు వివిధ పనులకు సంబంధించిన నిధులను కూడా శరవేగంగా విడుదల చేస్తోంది.అలాగే రైల్వేలకు సంబంధించి కూడా ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తోంది. ఇందులో భాగంగా అమరావతి రైల్వే లైను పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు రైల్వే ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న వందేభారత్ స్లీపర్ రైలును ఏపీకి కేటాయించబోతున్నారు.విశాఖకు స్లీపర్ రావాలంటే 6 నెలల సమయం విశాఖపట్నం నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు నడిపించాలంటూ ప్రభుత్వం నుంచి కేంద్రానికి వినతులు వెళ్లాయి. అలాగే ఎంపీలంతా లోక్ సభలో ప్రస్తావించడంతోపాటు లేఖలు రాయడం, రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ ను కలవడం జరిగాయి. ఇందులో భాగంగా విశాఖపట్నం నుంచి తిరుపతికి వందేభారత్ స్లీపర్ కేటాయించబోతున్నట్లు తెలుస్తోంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో వీటి ఉత్పత్తి జరుగుతోంది. తొలి వందేభారత్ స్లీపర్ జనవరిలో పట్టాలెక్కబోతోంది. దీన్ని ఏ స్టేషన్ నుంచి ఏ స్టేషన్ మధ్య తిప్పుతారనే విషయంలో స్పష్టత లేదు. తాజాగా విశాఖ నుంచి తిరుపతికి ఏపీ అడుగుతుండటంతో ఆరు నెలల్లో దీన్ని కేటాయించబోతున్నారు.

**విజయవాడ నుంచి బెంగళూరుకు కూడా**

ప్రస్తుతం వందేభారత్ స్లీపర్ పనులు జరుగుతుండటంతో వరుస ప్రకారం విశాఖకు రావాలంటే ఉత్పత్తి జరగడానికి ఆరునెలల సమయం పడుతోంది. అంటే జూన్ లో ఈ రైలు పట్టాలెక్కే అవకాశం ఉంది. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ కు రెండు, భువనేశ్వర్ కు ఒకటి, దుర్గ్ కు ఒకటి నడుస్తున్నాయి. స్లీపర్ వస్తే ఐదు రైళ్లవుతాయి. అలాగే విజయవాడ నుంచి నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, నంద్యాల, కర్నూలు, అనంతపురం మీదుగా బెంగళూరుకు వందేభారత్ నడపాలనే ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రిని పలుమార్లు కలిసి విన్నవించారు. త్వరలోనే ఇది కూడా కార్యరూపం దాల్చబోతోందని అధికారులు చెబుతున్నారు.

# మద్యం ప్రియులకు కిక్కిచ్చే వార్త.. వైన్స్ షాపులు, బార్ల సమయ వేళల పొడిగింపు!



**శాసనసభ /హైదరాబాద్ :** ఈ ఏడాది ముగియబోతోంది. ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుతూ డిసెంబర్ 31న పార్టీతో ఎంజాయ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇక డిసెంబర్ 31న మద్యం ప్రియులకు పండగే..పండగ. మందు పార్టీ చేసుకునేందుకు ముందుగానే ప్రిపేర్ అవుతుంటారు. కొందరైతే 31 కోసం ముందస్తుగానే మద్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. మద్యం షాపులకు ఫుల్లు గిరాకీ. ఈ నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31న వైన్స్ షాపులు సమయ వేళలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్ధరాత్రి వరకు వైన్ షాపులు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే బార్‌లు, రెస్టారెంట్‌లు కూడా తెల్లవారుజామున 1:00 గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. ఈ మార్పులను ధృవీకరిస్తూ ఎక్సైజ్ శాఖ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రభుత్వం వివిధ ప్రత్యేక కార్యక్రమాలు, కార్యక్రమాలను గ్రీన్‌లైట్ చేసింది.గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కొన్ని షరతులకు లోబడి తన అధికార పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలకు అనుమతులు మంజూరు చేసింది. పార్టీలు, పబ్‌లలో డ్రగ్స్ వాడకుండా చూడాలని ఈవెంట్ నిర్వాహకులను ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని నిరోధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, వైన్ షాపులను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడానికి అనుమతించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం వస్తుందని భావిస్తున్నారు.

# పైకి చూసి ఉత్తుత్తి చాక్లెట్లు అనుకునేరు.. అసలు మ్యాటర్ తెలిస్తే



థర్టీ ఫస్ట్ రోజు లైన్ క్రాస్ చేస్తే తాటతీస్తాం. డ్రగ్స్ వాడారో దబిడిదిబిడే. అక్రమ మద్యంతో దొరికారా అంతుచూస్తాం అంటూ నిన్ననే సీరియస్ వార్నింగ్ ఇచ్చారు పోలీసులు.అయినప్పటికీ కేటుగాళ్లు తగ్గేదేలే అంటున్నారు. తాజాగా చాక్లెట్ల రూపంలో గంజాయి తరలిస్తున్న కంత్రిగాళ్ల ఆటకట్టించారు ఎక్సైజ్ పోలీసులు. వివరాల్లోకి వెళ్తే.. కోదాడలో గంజాయి ముఠా గుట్టురట్టయింది. చాక్లెట్ల రూపంలో గంజాయిని తరలిస్తున్న కేటుగాళ్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు ఎక్సైజ్ పోలీసులు.గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని హైదరాబాద్ నుంచి కోదాడకు రోడ్డు మార్గంలో తీసుకెళ్తుండగా.. పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి దగ్గరున్న 25 గంజాయి చాక్లెట్ల బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. ఆ 25 బ్యాగుల్లో వెయ్యికిపైగా గంజాయి చాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. కాగా, ఈ ఘటనలో పోలీసుల ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయగా.. నిందితులు ఒడిశాకు చెందినవారిగా తెలుస్తోంది. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రుణాల గవేతదారులపై చర్యలేవీ !



మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దేశాన్ని దాటిన పలువురు బ్యాంక్ రుణాల ఎగవేతదారులను ఇప్పటికీ పట్టుకోలేక పోయారు. విజయమ్ మాల్యా,నీరవ్ మోడీ వంటివారు విదేశాల్లో తలదాచుకుని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రుణాలను ఎగవేసి నింపాదిగా దేశం దాటినా వారిని వెనక్కి రప్పించలేక పోయారు. అప్పులు చేసి ఎగవేసి, దేశం విడిచిన వారి బతుకులే హాయిగా ఉన్నాయి. దేశంకోసం కష్టపడి పనిచేస్తూ ఉన్న ప్రజలు మాత్రం పన్నుల ఊబిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నా రు. పన్నులు, ధరల భారతంతో దేశం అతలాకుతలం అవుతోంది. దివంతగత ప్రధాని మన్మోహన్ పదేళ్ల కాలం నాటి పరిస్థితితులకు మోడీ పదేళ్ల పాలను తేడాను గమనిస్తే ..ధరలు, పన్నులు ఎంతగా పెరగాయో గమనించవచ్చు. ఆర్‌బిఐ అందించిన లెక్కల ప్రకారమే 2020లో 2,154 గా ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 2024కి వచ్చేసరికి 2,664కు పెరిగిపోయారు.బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు ఎగవేసే కార్పొరేట్ల నుంచి వాటిని రికవరీ చేయడానికి బదులు, ఈ కంపెనీలకు ప్రతి యేటా లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తోంది. అదే సమయంలో దేశానికి అన్నం పెట్టే రైతులు సంక్షోభంలో ఉన్నారు, వారి రుణాలను మాఫీ చేయమంటే కుదరదు పొమ్మంటోంది. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లకు ప్రజల సొమ్ము దోచిపెట్టడం వల్ల బ్యాంకులకు కలిగే నష్టాలను భర్తీ చేసేందుకు డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు, మినిమమ్ బ్యాలెన్స్ లేకుంటే పెనాల్టీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలపై అధిక వడ్డీ వసూలు వంటి పద్ధతులు అవలంభిస్తున్నాయి.బ్యాంకులను ముంచేస్తున్న వారిపై మాత్రం ఎలాంటి క్రిమినల్ ప్రొసీజర్స్ ఉండడం లేదు. బ్యాంకులకు వీరు ఎగ్గొట్టిన మొత్తం ఈ కాలంలో లక్షా 52 వేల 860 కోట్ల రూపాయల నుంచి లక్షా 96 వేల కోట్ల 441 కోట్ల రూపాయలకు చేరింది. ఇదంతా సామాన్యులు బ్యాంకుల్లో చేసుకున్న డిపాజిట్ల సొమ్మే. ఇప్పటికీ బ్యాంకు మొత్తం డిపాజిట్లలో 75 శాతం దాకా సామాన్యుల నుంచి సేకరించినవేనని ఆర్‌బిఐ నివేదికలే చెబుతున్నాయి. సామాన్యులు దాచుకున్న సొమ్మును లూటీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లలో చాలా వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సన్నిహితులైన వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలే. ఈ రుణ ఎగవేతదారుల్లో చాలా మంది నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడినవారున్నారు. ఇటువంటి వారిని శిక్షించాల్సిన ప్రభుత్వం, ఆర్‌బిఐలే వారికి రక్షణగా ఉంటున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి డిపాజిటర్లు పొదుపు చేసిన సొమ్ము ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పాలవుతోంది. బ్యాంకులకు రుణబకాయిలు చెల్లించే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా ఎగవేసే క్రోనీ కేపిటలిస్టులు,కార్పొరేట్లు మోడీ ఏలుబడిలో రోజు రోజుకూ పెరిగిపోతున్నారు. 2023 జూన్ 3న ఆర్‌బిఐ జారీ చేసిన సర్క్యులర్‌లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులు, ఆర్థిక మోసాలకు పాల్పడినవారితో రాజీ ఒప్పందాలు కుదుర్చుకోవాలని బ్యాంకులకు సూచించింది. 2016లో తీసుకొచ్చిన దివాలా కోడ్ బ్యాడ్ లోన్స్‌ను థర్డ్ పార్టీకి విక్రయించాలని బ్యాంకులను ఆదేశిస్తోంది. మాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా దాఖలు చేసిన అర్జీకి ప్రతిస్పందనగా టాప్ 100 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల వివరాలను ఆర్‌బిఐ వెల్లడించి చేతులు దులిపేసుకుంది. 2018లో దేశం విడిచి పారిపోయిన నీరవ్‌మోడీకి చెందిన గీతాంజలి జెమ్స్ బ్యాంకులకు రూ.8,516 కోట్లు బకాయి పడింది. ఇదే అత్యధిక మొత్తం ఎగవేతదారుగా ఉంది. ఇప్పుడే కాదు, ఇంతకుముందు కూడా అది భారీగా రుణాన్ని ఎగవేసింది. ఎన్ని సార్లు ఎగవేసినా ఏమీ కాదు అన్న వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించాక ఎగవేత దారులు పెరగకుండా ఎలా ఉంటారు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాఫీ చేసిన రుణాలు అక్షరాలా 16.11 లక్షల కోట్ల రూపాయలు. అంతకుముందు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పదేళ్లలో మాఫీ చేసినదాంతో పోల్చితే ఇది ఎనిమిది రెట్లు ఎక్కువ. వామపక్షాల ఒత్తిడి ఫలితంగా యుపిఏ-1 ప్రభుత్వం అప్పట్లో రూ. 60 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే ఇది దండగమారిన చర్యగా గగ్గోలు పెట్టిన 'ప్రధాన స్రవంతి మీడియా' ఈ రుణ ఎగవేతలపై ఒక్క ముక్క కూడా ప్రస్తావించడం లేదు. అమెరికా లాంటి దేశాల్లో పారుబకాయిలు ఒక శాతం కంటే తక్కువగా ఉంటే భారత్‌లో ఇది 7.85 శాతంగా ఉన్నాయి. ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి 40 శాతం ఇవ్వాలి. కానీ, 12 శాతానికి మించి ఇవ్వడం లేదు. క్రోనీ కేపిటలిస్టులు,కార్పొరేట్ల పట్ల వున్న ప్రేమ వ్యవసాయంపై మోడీ ప్రభుత్వానికి లేదనడానికి ఇదొక నిదర్శనం. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒక వైపు ప్రైవేటీకరిస్తూ, ఇంకో వైపు ఉన్న బ్యాంకులను కూడా దివాలా తీయించే చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. దీనికి వ్యతిరేకంగా బ్యాంకు సిబ్బంది పలుమార్లు సమ్మె చేసినా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఈ స్థితిలో బ్యాంకులకు పెద్ద యెత్తున రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన వారి నుంచి తిరిగి రాబట్టేలా చూసేందుకు బ్యాంకు ఉద్యోగులతోబాటు ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించాలి. ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టాలి. అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థపై భారం తప్పుతుంది. ఇకపోతే పన్నుల విధానం సవరించకుండా ముందుకు సాగలేం. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. రూపాయి విలువ రోజురోజుకూ దిగజారుతోంది. ఈ పరిస్థితిలో పివి అనుసరించిన మార్గం మేరకు మరో ఆర్థికవేత్త రావాల్సి ఉంది.అప్పుడే భారత్ ఆర్థికరంగం పురోగమించగలదు.

# నేను ఇక్కడెందుకు ఉన్నా..?
## మృత్యుంజయుల తొలి స్పందన!



**శాసనసభ / హైదరాబాద్ :** దక్షిణ కొరియాలోని ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదంలో మొత్తం 179 మంది ప్రాణాలు కోల్పోగా కేవలం ఇద్దరు మాత్రమే మృత్యుంజయులుగా మిగిలారు.ఈ ఇద్దరిని ఫ్లైట్ అటెండెంట్‌లుగా గుర్తించారు. అందులో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు కాగా.. వారిద్దరికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం. అయితే, వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించిన వైద్యులకు ఆసక్తికర సమాధానం రావడం గమనార్హం.విమాన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన వారిని తొలుత స్థానిక మోక్పో హాంకూక్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం సియోల్‌లోని ఎవా ఆసుపత్రికి తరలించారు. ఓ ఫ్లైట్ అటెండెంట్ లీ (33)గా గుర్తించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసిన వైద్యులతో.. "అసలేం జరిగింది? నేను ఇక్కడెందుకు ఉన్నా?" అంటూ సమాధానం వచ్చింది. ల్యాండింగ్ సమయంలో సీటు బెల్టు పెట్టుకోవడం మాత్రమే తనకు గుర్తుందని, ఆ తర్వాత ఏం జరిగిందో గుర్తులేదని చెప్పినట్లు వైద్యులు తెలిపారు. అతడు షాక్‌కు గురైనట్లు తెలుస్తోందని, ప్రయాణికుల సేవల ఇన్‌ఛార్జ్‌గా ఉన్న అతడు విమానం తోక భాగంలో కూర్చున్నాడని చెప్పారు. అతడి భుజానికి,తలకు గాయాలైనట్లు వెల్లడించారు.ప్రాణాలతో బయటపడిన మరో అటెండెంట్‌ను క్వాన్ (25)గా గుర్తించారు. ఆమెకు తూర్పు సియోల్‌లోని అసన్ మెడికల్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. తల, పొత్తికడుపుతోపాటు కాళ్లకు గాయాలైనట్లు వైద్యులు వెల్లడించారు. ఆమెకు ప్రాణాపాయం లేదని పేర్కొన్న వైద్యులు.. ప్రమాదం గురించి అడిగేందుకు సమయం లభించలేదని చెప్పారు.ఇదిలాఉంటే, జెజు ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737-800 జెట్ విమానం.. థాయ్‌లాండ్ నుంచి 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో సియోల్‌కు 290 కిలోమీటర్ల దూరంలోని ముయాన్‌కు బయలుదేరింది. ముయాన్‌లో దిగుతుండగా విమానం ముందు భాగంలోని ల్యాండింగ్ గేర్ తెరుచుకోలేదు. దీంతో విమానం రన్‌వేపై జారుతూ.. నిప్పురవ్వలు రాజేస్తూ రక్షణ గోడ వైపు దూసుకెళ్లింది. వేగాన్ని నియంత్రించడం సాధ్యం కాలేదు. దాంతో ఎదురుగా ఉన్న గోడను ఢీకొట్టి పేలిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు మినహా ఏ ఒక్కరూ ప్రాణాలతో బయటపడలేదు.

# రోటీని డైరెక్ట్‌గా గ్యాస్ మంటపై కాల్చి తింటున్నారా?
## దీంతో వచ్చే డేంజర్ జబ్బు ఎంటో తెలుసా?



**శాసనసభ / హైదరాబాద్ :** రోజువారీ ఆహారంలో రోటీ ఒక ముఖ్యమైన భాగంగా ఉంటోంది.దీనిని భారతీయులు ప్రధాన ఆహారంగా వాడే ఒక పొడి గోధుమ పిండి (అటా)తో తయారు చేస్తారు. ఇది ఆహారంగా విస్తృతంగా ఉపయోగించబడే ముఖ్యమైన ఆహార పదార్థాల్లో ఒకటి ఉంది.అయితే, రోటీని గ్యాస్ మంటపై నేరుగా కాల్చి తినడం చాలా మందిలో అలవాటుగా మారింది . ఈ పద్ధతిలో చాలామంది రోటీలు మెత్తగా, పొంగుతూ రావాలని ఇలా చేస్తుంటారు.కానీ,ఇలా చేయడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.క్యాన్సర్ కారకాలు ఏర్పడటం: రోటీని డైరెక్ట్‌గా గ్యాస్ మంటపై కాల్చినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. ముఖ్యంగా, పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్, హెటెరోసైక్లిక్ అమైన్స్ వంటివి ఏర్పడతాయి.ఇవి క్యాన్సర్‌కు కారణమయ్యే కారకాలుగా గుర్తించబడ్డాయి. మాంసాహారాలను అధిక ఉష్ణోగ్రత వద్ద వండినప్పుడు కూడా ఇవి ఏర్పడతాయి. ఈ రసాయనాలుని దెబ్బతీస్తాయి, తద్వారా క్యాన్సర్ కణాలు వృద్ధి చెందే అవకాశం ఉంది.వాయు కాలుష్యం: గ్యాస్ స్టవ్ నుండి విడుదలయ్యే వాయువులు, ముఖ్యంగా నైట్రోజన్ డయాక్సైడ్ , ఆరోగ్యానికి హానికరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. రోటీని డైరెక్ట్‌గా మంటపై కాల్చినప్పుడు, ఈ కాలుష్యం మరింత పెరుగుతుంది. ఈ వాయువులు శ్వాసకోశ సమస్యలను, ముఖ్యంగా ఆస్తమా ఉన్నవారికి, మరింత తీవ్రతరం చేస్తాయి.జీర్ణ సమస్యలు: రోటీని సరిగ్గా కాల్చకపోతే లేదా మరీ ఎక్కువగా కాల్చితే, అది జీర్ణం కావడం కష్టం అవుతుంది. దీనివల్ల కడుపు నొప్పి, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. మాడిన రోటీలో కార్బన్ ఎక్కువగా ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థకు అంత మంచిది కాదు.పోషక విలువల నష్టం: రోటీని ఎక్కువగా కాల్చడం వల్ల అందులోని కొన్ని పోషకాలు, ముఖ్యంగా విటమిన్లు , ఖనిజాలు నశించే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రత వద్ద పోషకాలు విచ్ఛిన్నమవుతాయి, దీనివల్ల రోటీ యొక్క పోషక విలువ తగ్గుతుంది.

నల్లటి మచ్చలు: రోటీని డైరెక్ట్‌గా మంటపై కాల్చినప్పుడు నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఇవి కాల్చిన ఆహారంలో సాధారణం, కానీ ఎక్కువగా ఉంటే ఆరోగ్యానికి మంచిది కాదు. : డైరెక్ట్‌గా కాల్చేటప్పుడు అజాగ్రత్తగా ఉంటే మంటలు వచ్చే ప్రమాదం కూడా ఉంది.

**పరిష్కారాలు-ప్రత్యామ్నాయాలు:**

రోటీని నేరుగా మంటపై కాల్చకుండా, తవ్వా (పెనం) మీద కాల్చడం మంచిది. ఇది రోటీని సమానంగా కాల్చడానికి , హానికరమైన రసాయనాలు ఏర్పడకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. ఒకవేళ డైరెక్ట్‌గా కాల్చాల్సి వస్తే, మంటను తక్కువగా ఉంచాలి . రోటీని ఎక్కువగా కాల్చకుండా జాగ్రత్త పడాలి. గ్యాస్ స్టవ్ ను తరచుగా శుభ్రం చేయడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చు. బర్నర్‌లు శుభ్రంగా ఉంటే గ్యాస్ సమర్థవంతంగా మండుతుంది. వంట చేసే ప్రదేశంలో మంచి వెంటిలేషన్ ఉండటం చాలా ముఖ్యం. ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేదా కిటికీలు తెరిచి ఉంచడం ద్వారా కాలుష్య వాయువులు బయటకు వెళ్తాయి. రోటీలను ఎయిర్ ఫ్రైయర్‌లో కూడా కాల్చవచ్చు. ఇది ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం.రోటీని డైరెక్ట్‌గా గ్యాస్ మంటపై కాల్చడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, సాధ్యమైనంత వరకు తవ్వా మీద కాల్చడం లేదా ఇతర ప్రత్యామ్నాయ పద్ధతులను ఉపయోగించడం మంచిది. ఆరోగ్యకరమైన వంట పద్ధతులను పాటించడం ద్వారా మనం అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.రోటీని డైరెక్ట్‌గా గ్యాస్ మంటపై కాల్చి తింటున్నారా? దీంతో వచ్చే డేంజర్ జబ్బు ఎంటో తెలుసా?

రోజువారీ ఆహారంలో రోటీ ఒక ముఖ్యమైన భాగంగా ఉంటోంది.దీనిని భారతీయులు ప్రధాన ఆహారంగా వాడే ఒక పొడి గోధుమ పిండి (అటా)తో తయారు చేస్తారు. ఇది ఆహారంగా విస్తృతంగా ఉపయోగించబడే ముఖ్యమైన ఆహార పదార్థాల్లో ఒకటి ఉంది.అయితే, రోటీని గ్యాస్ మంటపై నేరుగా కాల్చి తినడం చాలా మందిలో అలవాటుగా మారింది . ఈ పద్ధతిలో చాలామంది రోటీలు మెత్తగా, పొంగుతూ రావాలని ఇలా చేస్తుంటారు. కానీ, ఇలా చేయడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

క్యాన్సర్ కారకాలు ఏర్పడటం: రోటీని డైరెక్ట్‌గా గ్యాస్ మంటపై కాల్చినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. ముఖ్యంగా, పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్, హెటెరోసైక్లిక్ అమైన్స్ వంటివి ఏర్పడతాయి. ఇవి క్యాన్సర్‌కు కారణమయ్యే కారకాలుగా గుర్తించబడ్డాయి. మాంసాహారాలను అధిక ఉష్ణోగ్రత వద్ద వండినప్పుడు కూడా ఇవి ఏర్పడతాయి. ఈ రసాయనాలుని దెబ్బతీస్తాయి, తద్వారా క్యాన్సర్ కణాలు వృద్ధి చెందే అవకాశం ఉంది.వాయు కాలుష్యం: గ్యాస్ స్టవ్ నుండి విడుదలయ్యే వాయువులు, ముఖ్యంగా నైట్రోజన్ డయాక్సైడ్ , ఆరోగ్యానికి హానికరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. రోటీని డైరెక్ట్‌గా మంటపై కాల్చినప్పుడు, ఈ కాలుష్యం మరింత పెరుగుతుంది. ఈ వాయువులు శ్వాసకోశ సమస్యలను, ముఖ్యంగా ఆస్తమా ఉన్నవారికి, మరింత తీవ్రతరం చేస్తాయి.

జీర్ణ సమస్యలు: రోటీని సరిగ్గా కాల్చకపోతే లేదా మరీ ఎక్కువగా కాల్చితే, అది జీర్ణం కావడం కష్టం అవుతుంది. దీనివల్ల కడుపు నొప్పి, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. మాడిన రోటీలో కార్బన్ ఎక్కువగా ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థకు అంత మంచిది కాదు.పోషక విలువల నష్టం: రోటీని ఎక్కువగా కాల్చడం వల్ల అందులోని కొన్ని పోషకాలు, ముఖ్యంగా విటమిన్లు , ఖనిజాలు నశించే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రత వద్ద పోషకాలు విచ్ఛిన్నమవుతాయి, దీనివల్ల రోటీ యొక్క పోషక విలువ తగ్గుతుంది.

నల్లటి మచ్చలు: రోటీని డైరెక్ట్‌గా మంటపై కాల్చినప్పుడు నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఇవి కాల్చిన ఆహారంలో సాధారణం, కానీ ఎక్కువగా ఉంటే ఆరోగ్యానికి మంచిది కాదు. : డైరెక్ట్‌గా కాల్చేటప్పుడు అజాగ్రత్తగా ఉంటే మంటలు వచ్చే ప్రమాదం కూడా ఉంది.

**పరిష్కారాలు-ప్రత్యామ్నాయాలు:**

రోటీని నేరుగా మంటపై కాల్చకుండా, తవ్వా (పెనం) మీద కాల్చడం మంచిది. ఇది రోటీని సమానంగా కాల్చడానికి , హానికరమైన రసాయనాలు ఏర్పడకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. ఒకవేళ డైరెక్ట్‌గా కాల్చాల్సి వస్తే, మంటను తక్కువగా ఉంచాలి . రోటీని ఎక్కువగా కాల్చకుండా జాగ్రత్త పడాలి. గ్యాస్ స్టవ్ ను తరచుగా శుభ్రం చేయడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చు. బర్నర్‌లు శుభ్రంగా ఉంటే గ్యాస్ సమర్థవంతంగా మండుతుంది. వంట చేసే ప్రదేశంలో మంచి వెంటిలేషన్ ఉండటం చాలా ముఖ్యం. ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేదా కిటికీలు తెరిచి ఉంచడం ద్వారా కాలుష్య వాయువులు బయటకు వెళ్తాయి. రోటీలను ఎయిర్ ఫ్రైయర్‌లో కూడా కాల్చవచ్చు.రోటీని డైరెక్ట్‌గా గ్యాస్ మంటపై కాల్చడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, సాధ్యమైనంత వరకు తవ్వా మీద కాల్చడం లేదా ఇతర ప్రత్యామ్నాయ పద్ధతులను ఉపయోగించడం మంచిది. ఆరోగ్యకరమైన వంట పద్ధతులను పాటించడం ద్వారా మనం అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.


TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867
శాసనసభ
తెలుగు దినపత్రిక
మంగళవారం 31 డిసెంబర్ - 2024

# పారాలింపిక్స్ పతక విజేత దీప్తికి చిరంజీవి అభినందన



పారా ఒలింపిక్స్ విజేత జీవాంజి దీప్తిని అగ్రనటుడు చిరంజీవి అభినందించారు. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో చిరంజీవి, దీప్తి పాల్గొన్నారు.పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు టీ-20 విభాగంలో కాంస్య పతకం సాధించిన జీవాంజీ దీప్తి ప్రతిభకు తగిన గుర్తింపు లభించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరినాథ్ తదితరులు పాల్గొన్నారు.జీవాంజీ దీప్తి స్వగ్రామం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెద గ్రామం. తల్లిదండ్రులు యాదగిరి, లక్ష్మి. బిడ్డ విజయం వెనకాల తల్లిదండ్రుల కృషి అపారం. వీరిది నిరుపేద కుటుంబం. దీప్తికి మానసిక వైకల్యం. మేధోపరమైన బలహీనత ఉండడంతో పసితనంలో ఆమె కోసం తండ్రి యాదగిరి తల్లడిల్లారు. కూతురుకు ఫిట్స్ వస్తే విలవిల్లాడిపోయేవారు. ఒక దశలో దీప్తి క్రీడల్లో రాణించేందుకు డబ్బులకు వెనకాడవద్దని యాదగిరి తనకున్న ఎకరం పొలాన్ని అమ్మేశారు. తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో దీప్తి తిరుగులేని క్రీడాకారిణిగా మారింది. ఆమె మానసిక స్థితి చూసి ఇరుగు పొరుగు వారు తరచూ అవహేళన చేసేవారట. ఇప్పుడు ఈమె ఏకంగా పారాలింపిక్స్‌లో పతకం సాధించి పుట్టిన గడ్డకే కాదు, రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

# 'గేమ్ ఛేంజర్' పాటల పై మేకర్స్ ఎంత ఖర్చు చేసారంటే....!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' జనవరి 10, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. శంకర్ షణ్ముగం దర్శకత్వం వహించిన ఈ చిత్రం పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది మరియు ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఇది ఒకటి.పాటలు ప్రేక్షకుల నుండి అపూర్వమైన స్పందనను అందుకుంటూ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మేకర్స్ ఈ ట్రాక్‌లపై 75 కోట్లు ఖర్చు చేసారు. గ్రాండ్ సెట్‌లు, అద్భుతమైన కొరియోగ్రఫీ మరియు సుందరమైన లొకేషన్‌లతో వాటిని దృశ్య మరియు సంగీత దృశ్యాలుగా మార్చాయి. ప్రభుదేవా కొరియోగ్రాఫ్ చేసిన జరగండి అనే అద్భుతమైన పాటలలో ఒకటైన 70 అడుగుల కొండ-విలేజ్ సెట్‌లో 600 మంది నృత్యకారులతో 13 రోజుల పాటు చిత్రీకరించబడింది.
పాట పర్యావరణ అనుకూలమైన జూట్ దుస్తులను కూడా ఉపయోగిస్తుంది, ఇది ప్రత్యేకమైన టచ్‌ని జోడిస్తుంది. మరో ట్రాక్, రా మచ్చా, రామ్ చరణ్‌ని పరిచయం చేస్తూ గుస్సాడి మరియు చావు వంటి సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్న 1,000 మంది జానపద నృత్యకారులతో భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని జరుపుకుంటారు. న్యూజిలాండ్‌లో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో చిత్రీకరించబడిన రొమాంటిక్ పాట నా నా హైరానా కలలు కనే దృశ్యమాన అనుభవాన్ని సృష్టిస్తుంది. రామ్చ రణ్ మరియు కియారా అద్వానీ నటించిన ఈ ట్రాక్ పాశ్చాత్య మరియు కర్ణాటక సంగీతాన్ని మిళితం చేస్తుంది.ఇంతలో టెక్నో డ్యాన్స్ నంబర్ అయిన ధోప్, మహమ్మారి సమయంలో విలాసవంతమైన సెట్‌లలో 100 మంది రష్యన్ డ్యాన్సర్‌లతో చిత్రీకరించబడింది. ఇది భవిష్యత్ దృశ్యాలు మరియు సిజ్లింగ్ కొరియోగ్రఫీని అందిస్తుంది. ఐదవ పాట మిస్టరీగా మిగిలిపోయింది, చిత్రనిర్మాతలు పెద్ద స్క్రీన్‌కు ఆశ్చర్యం కలిగించేలా ఉంచారు. సుందరమైన గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో చిత్రీకరించబడిన ఇది శాశ్వతమైన ముద్రను మిగుల్చుతుందని భావిస్తున్నారు. థమన్ సంగీతంతో గేమ్ ఛేంజర్ అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని కలిగిస్తుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, సముద్రఖని, శ్రీకాంత్, అంజలి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మోస్ట్ ఎవైటెడ్ ఫ్రాంచైజీలో కేజీఎఫ్ బ్యూటీ

యువ కన్నడ నటి శ్రీనిధి శెట్టి ప్రపంచవ్యాప్తంగా KGF ఫ్రాంచైజీ యొక్క భారీ విజయాన్ని సాధించినప్పటి నుండి దక్షిణాదిలో అత్యంత డిమాండ్ ఉన్న నటీమణులలో ఒకరిగా మారింది.ఆమె తదుపరి చిత్రం విక్రమ్ యొక్క కోబ్రా బాక్సాఫీస్ వద్ద విఫలమైనప్పటికీ శ్రీనిధి తెలుగులో రెండు సినిమాలకు సైన్ చేసింది. సిద్దు జొన్నలగడ్డ యొక్క తెలుసు కదా మరియు నాని యొక్క హిట్ 3. తమిళ సినీ వర్గాల్లో కొనసాగుతున్న సందడి ఏదైనా ఉంటే కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ యొక్క అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ 'జైలర్ 2' లో శ్రీనిధి శెట్టి కీలక పాత్ర కోసం ఎంపికైంది అని లేటెస్ట్ టాక్. స్పష్టంగా శ్రీనిధి ఒక ప్రధాన పాత్రలో కనిపించనుంది అని సమాచారం.
జైలర్‌లో ప్రత్యేక పాటలో తమన్నాతో పాటు పాత్ర అని ఫిలిం సర్కిల్ లో వార్తలు వినిపిస్తున్నాయి. జైలర్ 2 తారాగణంలో శ్రీనిధి చేరికకు సంబంధించిన అధికారిక ధృవీకరణ మేకర్స్ నుండి రావలిసిఉంది. జైలర్ 2 చిత్రానికి నెల్సన్ దర్శకత్వం వహించగా సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ క్రేజీ సీక్వెల్‌కి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నాడు. ఈ ప్రాజెక్ట్ కి సంబందించిన మరిన్ని వివరాలని మూవీ మేకర్స్ త్వరలో వెల్లడి చేయనున్నారు.

# ఎన్నో ఏళ్లుగా మీరంతా నాపై చూపిస్తున్న అభిమానం అసాధారణమైంది.



తనపై అభిమానులు చూపే ప్రేమ తీరును మార్చుకోవాలని నటుడు యశ్ విజ్ఞప్తి చేశారు. తన పుట్టినరోజుని పురస్కరించుకుని బహిరంగంగా వేడుకలు చేయొద్దని కోరారు.ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు."కొత్త సంవత్సరం వస్తుందంటే మనం కొత్త నిర్ణయాలు తీసుకోవాలి. జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలి. ఎన్నో ఏళ్లుగా మీరంతా నాపై చూపిస్తున్న అభిమానం అసాధారణమైంది. ఆ క్రమంలో దురదృష్టవశాత్తూ కొన్ని సంఘటనలూ జరిగాయి. మన ప్రేమ భాషను మార్చుకోవాల్సిన సమయమిది. ముఖ్యంగా నా బర్త్‌డే సెలబ్రేషన్స్ విషయంలో.. మీ అభిమానాన్ని, ప్రేమను గ్రాండ్ ఈవెంట్స్‌తో చూపే ప్రయత్నం చేయొద్దు. మీరంతా సురక్షితంగా ఉండడం, అనుకున్న లక్ష్యాలు చేరుకోవడం, ఆనందంగా ఉ ఒడడమే నాకు పెద్ద బహుమతి. సినిమా షూటింగ్ కారణంగా నా పుట్టినరోజున సిటీలో ఉండను. కానీ, మీరు హృదయపూర్వకంగా చెప్పే శుభాకాంక్షలు నాకు చేరతాయి. నాలో స్ఫూర్తి నింపుతాయి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిమానులందరికీ ముందుగానే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.జనవరి 8.. యశ్ పుట్టినరోజు. ఈ ఏడాది ఆయన బర్త్‌డే సందర్భంగా కటౌట్‌లు ఏర్పాటు చేస్తూ కరెంట్ షాక్‌కు గురై ముగ్గురు అభిమానులు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆ సమయంలో.. బాధిత కుటుంబాలను నటుడు పరామర్శించి.. వారి బాధ్యత తీసుకుంటున్నట్టు తెలిపారు. 'ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టే నాకు పుట్టినరోజు వస్తుందంటేనే భయమేస్తోంది' అని మీడియా ముందు భావోద్వేగానికి గురయ్యారు.2022లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కేజీయఫ్ 2' తర్వాత యశ్ నుంచి మరో సినిమా రాలేదు. ప్రస్తుతం 'టాక్సిక్' లో నటిస్తున్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. 1950-70ల మధ్య జరిగే డ్రగ్ మాఫియా కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. 2025 ఏప్రిల్ 10న విడుదల కానుంది.

# ప్రముఖనటుడితో పెళ్లి..అయితే ఆగిపోయింది..



ప్రముఖ మ్యూజిక్ రియాల్టీ షో ఇండియన్ ఐడల్‌లో సందడి చేశారు బాలీవుడ్ అలనాటి నటి సంగీతా బిజ్లానీ. ఇందులో ఆమె తన వ్యక్తిగత విషయాలు పంచుకున్నారు.సల్మాన్ ఖాన్‌తో పెళ్లి గురించి గతంలో జరిగిన ప్రచారంపై ఎన్నో ఏళ్ల తర్వాత ఆమె పెదవి విప్పారు. 'సల్మాన్ ఖాన్‌తో నా పెళ్లి జరగాల్సింది. అనివార్య కారణాల వల్ల అది ఆగిపోయింది. అది నిజమే' అని కంటెస్టెంట్ ప్రశ్నకు సమాధానమిచ్చారు."నిజమే. కాకపోతే దీని గురించి నేను మరేమీ చెప్పాలనుకోవడం లేదు" అని తెలిపారు. సంగీత వ్యాఖ్యలు షోలో పాల్గొన్న వారందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయి. మరోవైపు, ఇదే విషయాన్ని గతంలో సల్మాన్ ఖాన్ కూడా మాట్లాడారు. తనకు పెళ్లి జరగాల్సిందని.. శుభలేఖలు కూడా ముద్రించిన తర్వాత అది ఆగిపోయిందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ అమ్మాయి ఎవరనేది మాత్రం ఆయన చెప్పలేదు.ఇదే కార్యక్రమంలో సంగీత తన మాజీ భాగస్వామి గురించి మాట్లాడారు. అతడి ప్రవర్తన వల్ల తాను ఇబ్బందిపడినట్లు చెప్పారు. "ఏదైనా మార్చుకునే అవకాశం వస్తే నా మాజీ భాగస్వామితో జీవితాన్ని మారుస్తా. మొదట్లో మా మధ్య రిలేషన్ బాగానే ఉండేది. రాను రాను అతడు కండిషన్స్ పెట్టడం మొదలు పెట్టాడు. ఈ దుస్తులు వేసుకోవద్దు. ఆ దుస్తులు వేసుకోవద్దు. డ్రెస్‌కి నెక్ మరీ ఇంత డీప్ ఎందుకు? అని సతాయించాడు. మొదట్లో ఎలాంటి డ్రెస్సులు వేసుకున్నా ఇబ్బంది పెట్టేవాడు కాదు కానీ తర్వాత అలా లేదు. ఇప్పుడు నాకు నచ్చినట్టు నేను జీవిస్తున్నా" అని ఆమె అన్నారు. అయితే అతడు ఎవరనేది మాత్రం సంగీత చెప్పలేదు.'యోధ', 'విష్ణు దేవా', 'ఇజ్జత్', 'గేమ్' వంటి చిత్రాల్లో సంగీత యాక్ట్ చేశారు. ఆమె మోడల్‌గా రాణించిన సమయంలో సల్మాన్ ఖాన్‌తో కలిసి పలు వాణిజ్య ప్రకటనల కోసం వర్క్ చేశారు. అప్పుడే వీరిద్దరి మధ్య ప్రేమ మొదలైందని వార్తలు వచ్చాయి. పెళ్లి చేసుకుంటారని అందరూ భావించారు.



# కెప్టెన్సీ ఉండటం వల్లే రోహిత్ ఆడుతున్నాడు.. లేకపోతే: మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్



టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ కొన్ని నెలలుగా టెస్టుల్లో పేలవ ప్రదర్శన చేస్తున్నాడు. స్వదేశంలో కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో ఒక అర్ధ శతకం బాదాడు.ఇటీవల రోహిత్ చేసిన అత్యధిక స్కోరు అదే.బోర్డర్-గావస్కర్ ట్రోఫీలోనైనా రాణిస్తాడనుకుంటే మరింత దారుణంగా ఆడుతున్నాడు. కనీసం 20,30 పరుగులూ చేయట్లేదు. గత 15 ఇన్నింగ్స్‌ల్లో అతని సగటు 10.93 ఉందంటే పరిస్థితి అతని ఫామ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో రోహిత్ శర్మపై విమర్శల తాకిడి ఎక్కువైంది.అతను జట్టుకు భారంగా మారాడని, టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తే మంచిదనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ ముగిశాక ఈ విషయంలో రోహిత్ ఏదొక నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. తాజాగా రోహిత్ ఫామ్‌పై మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పందించాడు. కెప్టెన్ కావడం వల్లే రోహిత్ తుది జట్టులో ఉ ఒటున్నాడని పేర్కొన్నాడు. కెప్టెన్‌గా లేకపోతే ప్లేయింగ్ ఎలెవన్‌లో అతని స్థానం ప్రశ్నార్థకంగా మారుతుందని వ్యాఖ్యానించాడు.'అంతర్జాతీయ క్రికెట్‌లో దాదాపు 20,000 పరుగులు చేసిన రోహిత్ శర్మ ఇప్పుడు రన్స్ చేయలేక ఇబ్బందిపడుతున్నాడు. అతను ఫామ్ అందుకోలేకపోతున్నాడు. ప్రస్తుతం ఏం జరుగుతుందంటే.. కెప్టెన్ కాబట్టి అతను ఆడుతున్నాడు. రోహిత్ కెప్టెన్ కాకపోతే ఇప్పుడు ఆడకపోయి ఉండేవాడేమో. అతను లేకపోతే భారత్‌కు ఒక కచ్చితమైన తుది జట్టు ఉండేది. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, వన్‌డౌన్‌లో శుభ్‌మన్ గిల్ వచ్చేవారు. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుకుంటే రోహిత్ బ్యాటర్‌గా ఇబ్బందిపడుతున్నాడు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే అతనికి తుది జట్టులో చోటు దక్కకపోవచ్చు' అని ఇర్ఫాన్ పఠాన్ స్టార్ స్పోర్ట్స్‌తో అన్నాడు.

# క్రీడాలోకం 2024.. రికార్డులొచ్చాయి.. వివాదాలూ ముసిరాయి



చదరంగంపై ఆధిపత్యం.. షూటింగ్‌లో మెరుపులు.. ఇంటికొచ్చిన ప్రపంచ కప్.. ఇలా భారత క్రీడాలోకం 2024లో చూసిన అద్భుత ఫలితాలెన్నో. అదే సమయంలో పలు వివాదాలూ అభిమానులను కలవరానికి గురి చేశాయి.
ఓవరాల్‌గా టీమ్ఇండియా కు ఈ ఏడాది బాగానే కలిసొచ్చింది.ఒలింపిక్స్‌లో మను, నీరజ్ నాలుగేళ్లకొకసారి జరిగే ఒలింపిక్స్ ఈ సారి కూడా పారిస్ వేదికగా అట్టహాసంగా జరిగాయి. భారత్‌కు స్వర్ణ పతకం మాత్రం దక్కలేదు. కానీ, యువ షూటర్ మను బాకర్, జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రా ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ప్లేయర్లుగా నిలిచారు. గత టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన నీరజ్.. ఈసారి రజతం సాధించాడు. అయితే, మను బాకర్ మాత్రం ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు (కాంస్యాలు) సాధించిన తొలి షూటర్‌గా రికార్డు సాధించింది. గతంతో పోలిస్తే భారత్‌కు ఒక పతకం తక్కువ రావడంతోపాటు ర్యాంక్ కూడా పడిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో 48వ స్థానంలో ఉండగా.. పారిస్‌లో 71కి పడిపోయింది.


**ఫైనల్‌కు చేరినా.. పతకం దూరం**

వంద గ్రాముల బరువు అధికంగా ఉన్నందుకు ఫైనల్‌కు చేరినప్పటికీ వినేశ్ ఫొగాట్‌కు పతకం చేజారింది. కనీసం రజతం ఇవ్వాలని డిమాండ్ చేసినా ఫలితంలేకుండాపోయింది. దీంతో రెజ్లింగ్‌కు వీడ్కోలు చెబుతున్నట్లు సంచలన ప్రకటన చేసింది. స్పోర్ట్స్ అథారిటీ మద్దతు ఇవ్వడం లేదని ఆరోపణలు చేసింది. ఇప్పటికే రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే.



**పారాలింపిక్స్‌లో పతకాల పండగ**

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్‌కు ఈ సారి పతకాల పంట పండింది. టోక్యో పారాలింపిక్స్‌లో మన దివ్యాంగ యోధులు 19 మెడళ్లు గెలుచుకోగా.. ఈ సారి పాతిక పతకాలను సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగారు. అయితే, అంచనాలకు మించి అద్వితీయ ప్రదర్శన చేసి 29 పతకాలు ఒడిసిపట్టారు. ఇందులో అత్యధిక మెడల్స్ అథ్లెటిక్స్‌లోనే రావడం విశేషం. ఈ విభాగంలో నాలుగు స్వర్ణాలు సహా 17 పతకాలు వచ్చాయి. ఓవరాల్‌గా ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో 18వ స్థానంలో నిలిచింది. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యధిక పతకాలు సాధించడం ఇదే తొలిసారి.



**చెస్ రారాజు గుకేశ్.. రారాణి హంపి**

భారత చదరంగం క్రీడకు ఈ ఏడాది భలేగా కలిసొచ్చింది. ఇటీవలే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్ డి గుకేశ్ విశ్వ విజేతగా నిలిచాడు. ఇక తాజాగా న్యూయార్క్ వేదికగా ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌గా తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి నిలిచి చరిత్ర సృష్టించింది. 2019లోనూ ఆమె ఛాంపియన్‌గా నిలిచింది.

**టీ20 ప్రపంచ కప్ విజేతగా..**

క్రికెట్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఓటమిని చవిచూసిన భారత్.. విండీస్ - యూఎస్‌ఏ వేదికగా జరిగిన టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ఫైనల్‌లో సూర్యకుమార్ సూపర్ క్యాచ్‌తో వరల్డ్ కప్‌ను భారత్‌కు అందించాడు. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీ టీ20లకు వీడ్కోలు పలికారు. కొత్త కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టాడు. ఐసీసీ ఛైర్మన్‌గా జైషా ఎన్నికైన సంగతి తెలిసిందే.



**చరిత్ర సృష్టించిన రోహన్ బోపన్న**

ఈ ఏడాది ఆరంభంలో భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న అరుదైన రికార్డు సాధించాడు. అత్యంత పెద్ద వయసులో (43 ఏళ్లు) నంబర్‌వన్ ర్యాంకర్‌గా (డబుల్స్ విభాగం) నిలిచి చరిత్ర సృష్టించాడు. అంతేకాదు ఆస్ట్రేలియన్ ఓపెన్ 2024 డబుల్స్ విభాగంలో తన సహచరుడు ఎబ్డెన్‌తో (ఆస్ట్రేలియా) కలిసి విజేతగా నిలిచాడు. ఫైనల్‌లో ఇటలీ జోడీ సిమోన్-వావాసోరిపై విజయం సాధించి కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అతిపెద్ద వయసులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన టెన్నిస్ ప్లేయర్‌గానూ రోహన్ (43 ఏళ్లు) ఘనత సాధించాడు.

**టేబుల్ టెన్నిస్‌లో మహిళల జట్టు రికార్డు** అక్టోబర్‌లో కజఖ్‌స్థాన్‌లో జరిగిన ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల టీమ్ చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీలో తొలిసారిగా కాంస్య పతకాన్ని సాధించింది. ఐహిక ముఖర్జీ, మనిక బాత్రా, సుతీర్థ ముఖర్జీ, ఆకుల శ్రీజ, దియా చితాలెల బృందం సెమీస్‌లో జపాన్ చేతిలో ఓడి కాంస్యం పతకం అందుకుంది.